

కార్మిక లోకం

మాసపత్రిక

సంచిక : 11 సంపుటి: 32 నవంబర్ - 2018 రూ.7/-

నిర్బంధాలను ఎదుర్కొని సాగిన మున్సిపల్ కార్మికుల పోరాటం

ఉద్యమాల కాణాచి

నందూరి

నందూరి ప్రసాదరావు గారు సనాతన బ్రాహ్మణ కుటుంబంలో 1912, సెప్టెంబర్ 24 జానకి రామయ్య, శాంతమ్మ దంపతులకు కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఆరుగొలనులో జన్మించారు. బందరులో ఇంటర్ చదువుతున్నప్పటి నుండీ జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. స్వాతంత్రోద్యమానికి నాయకత్వం వహిస్తున్న జాతీయ కాంగ్రెసు అనుసరిస్తున్న పంథా పట్ల ప్రజల్లో భ్రమలు తొలగసాగాయి. అసంతృప్తి చెందిన యువకులు సోషలిస్టు భావాల వైపు ఆకర్షితులు కావడంతో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ఏర్పాటైంది.

1953లో నందూరి ప్రసాదరావుగారు కిసాన్ సభ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వివిధ ప్రాంతాల్లో రైతుల సమస్యల గురించి ఆయన లోతైన అధ్యయనం చేశారు. రైతాంగాన్ని కదిలించడానికి ఉపయోగపడే నినాదాలను రూపొందించారు. ఆలిండియా కిసాన్ సభ నాయకుడుగా చాలా సంవత్సరాలు పనిచేసిన నందూరి ఉద్యమ అవసరాల రీత్యా ఢిల్లీ నుండి ఆంధ్రప్రదేశ్‌కి తిరిగి వచ్చి వ్యవసాయ కార్మిక సంఘం, తర్వాత సిఐటియులో ప్రధాన బాధ్యతలో ఉండి అపారమైన సేవలందించారు.

1970 నుండి 2001 వరకు సిఐటియు ఏపీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆంధ్రరాష్ట్రంలో సిఐటియుకు విశిష్ట గుర్తింపు చేకూర్చటంలో ప్రసాదరావుగారి పాత్ర గణనీయమైంది. ఉద్యమాలకు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎడతెగని కృషి చేస్తూ అదే సమయంలో వివిధ స్థాయిల్లోని కేడర్‌కు రాజకీయ విద్యను, ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఎత్తుగడలను, కార్మికుల ఐక్య కార్యాచరణ అవసరాన్ని తెలియపర్చడానికి శిక్షణా తరగతులు నిర్వహించేవారు. వందల మంది రెండో శ్రేణి నాయకులకు, ఉపాధ్యాయులకు తర్ఫీదునిచ్చేవారు.

కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అనేక చర్యలను బట్టబయలు చేస్తూ ప్రచార సాహిత్యాన్ని, కరపత్రాలను వ్యాసాల రూపంలో ప్రచురించడంలో ఆయనకు ఆయనే సాటి.

సిఐటియు సభలకు కార్మికవర్గ చైతన్యాన్ని కలిగించేందుకు, వివిధ సెక్షన్స్‌ను పోరాటాల్లోకి ఆకర్షించేందుకు, ఐక్యపోరాటాల ప్రాధాన్యతను తెలియజెప్పేందుకు ముఖ్య సాధనంగా "కార్మికలోకం" మాసపత్రికను మూడు దశాబ్దాలు కామ్రేడ్ నందూరి ప్రసాదరావు గారి సంపాదకత్వాన నిర్వహించడం జరిగింది.

ఆయన జీవిత అనుభవాలు రిఫరెన్స్ పుస్తకం లాంటివి. ఎప్పుడు ఏ సమస్య గురించైనా చారిత్రక అంశాలతో ఒక వ్యాసమో, ఒక క్లాసో అడిగితే నో అనే ఆన్సర్ వచ్చేది కాదు. అధికార పూర్వక సమాచారంతో వ్యాసం తయారు చేసేవారు. 3 దశాబ్దాల ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఆయన హాజరుకావాల్సిన ఏ సమావేశానికీ గైర్హాజరుకా లేదు.

నందూరిప్రసాదరావు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. నిరంతరం అధ్యయనం చేసేవారు. గతితార్కిక భౌతికవాదం పుస్తకాన్ని సామాన్య కార్యకర్తలకు కూడా అర్థమయ్యే రీతిలో రచించారు. నిరాడంబరతకు, క్రమ శిక్షణకు ఆయన పెట్టింది పేరు. పెద్ద నాయకుడైనా తన వ్యక్తిగత సౌకర్యాలకు ఏనాడూ ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎక్కడకు వెళ్లినా ఆఫీసులోనే మకాం పెట్టేవారు. తన వ్యక్తిగత పనులను ఇతరులకు చెప్పడం చాలా అరుదు. తన పరిసరాలు ఆయనే శుభ్రపరచుకునేవారు. ట్రేడ్ యూనియన్ రంగంలో క్రమశిక్షణేగాక వ్యక్తిగత క్రమశిక్షణ ఆయన నుండి నేర్చుకోవాల్సిందే. కార్యకర్తలను స్వంత కుటుంబ సభ్యులుగా చూసేవారు.

రైతాంగ, కార్మికోద్యమాల్లో తనదంటూ ప్రత్యేకతను నందూరి నిలబెట్టుకున్నారు. ఎన్ని కష్టాలు, నిర్బంధాలు ఎదురైనా ఆయన దృఢ దీక్షను సడలించలేకపోయాయి. త్యాగనిరతి, అధ్యయనం, ప్రజలతో, కార్యకర్తలతో మమేకమవ్వడం, ప్రజల నుండి తెలుసుకోవడం ఇత్యాది ఎన్నో అంశాల్లో కా॥నందూరి ఈనాటి తరానికీ ముఖ్యంగా కార్మికవర్గ నాయకత్వానికి ఆదర్శప్రాయులు.

నవంబర్ - 2018

కార్మిక లోకం

సి.ఐ.టి.యు. ఆంధ్రప్రదేశ్ కమిటీ మాసపత్రిక

సంపుటి : 32
సంచిక : 11
విడి ప్రతి వెల : రూ. 7/-
సం॥ చందా : రూ. 75/-

విషయసూచిక

సంపాదకీయం ---------------------- 3
బొమ్మలు చెప్పిన కథ ------------------ 4
ఈ మాసం కవిత --------------------- 5
డాక్టర్ డాక్టర్ ---------------------- 6
వినిమయ ధరల సూచిక -------------- 7
కవర్ పేజీ కథనం -------------------- 8,9
రాఫెల్ కుంభకోణం -------------- 10, 11
భద్రతలేని బతుకులు ------------------ 11
కేరళ హైకోర్టు తీర్పు -------------- 12, 13
శబరిమల - వాస్తవాలు ---------- 14, 15
సామాజిక న్యాయం---------------- 16,17
మధ్యపేజీ కథనం ----------------- 18,19
[illegible]మిక మహిళ------------------ 20-23
ఉద్యమ వార్తలు ----------------- 24-31
ఈ మాసం కథ ----------------- 32, 33
సినిమా --------------------------- 34

అడ్రస్ :
నందూరి ప్రసాదరావు భవన్,
24-24-14, రజకవీధి,
దుర్గాపురం, విజయవాడ-3
సెల్ : **9490098022 - 0866-2442988**

ఎడిటర్ : **ఎం.ఏ.గఫూర్**
వర్కింగ్ ఎడిటర్ : **కె.స్వరూపరాణి**
ఎడిటోరియల్ బోర్డు :
పి. అజయ్ కుమార్,
కె.ఉమామహేశ్వరరావు,
ఎం.వి.సుధాకర్,
కె.సత్యరంజన్, జి.వి.రంగారెడ్డి

మేనేజిరియల్ బోర్డు
మేనేజర్ : **యం.బాలకాశి**
సభ్యులు : **కె.సురేష్**

సంపాదకీయం

జనవరి 8-9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

బీజేపీని గద్దె దించండి. మోడీని గద్దె దించండి.. దేశాన్ని రక్షించండి..

...అనే నినాదంతో సెప్టెంబర్ 25న ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక, స్వతంత్ర ఫెడరేషన్ల జాతీయ సదస్సు 2 రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2019 జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జనబాహుళ్య విస్తృత ప్రయోజనాలరీత్యా అనివార్య పరిణామం. ఈ సమ్మెకు మద్దతు తెలపాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎమ్‌ఎస్, ఎఐయుటియుసి, టియుసిసి, ఎఐసిసిటియు, ఎస్‌ఇడబ్ల్యుఎ, ఎల్‌పిఎఫ్, యుటియుసి తదితర జాతీయ కార్మిక సంఘాలు ఉమ్మడిగా సదస్సు నిర్వహించాయి. బ్యాంకు, ఇన్సూరెన్స్, రైల్వే, రక్షణ, బిఎస్‌ఎన్‌ఎల్, స్టీల్, కోల్, పోస్టల్ తదితర స్వతంత్ర ఫెడరేషన్లు కూడా పాల్గొన్నాయి. మోడీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మికవర్గం ఐక్యంగా సెప్టెంబర్ 2015, 2016ల్లో సార్వత్రిక సమ్మెలను జయప్రదంగా నిర్వహించింది. 2017 నవంబర్ 9-11 తేదీల్లో లక్షలాది మంది కార్మికులతో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్‌లు ఐక్యంగా ఢిల్లీలో మహాపడావ్ నిర్వహించాయి.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్రాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, దేశ వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశ ఆర్థిక పరిస్థితి దారుణంగా క్షీణించింది. దీని దుష్ప్రభావం కార్మికవర్గంపై పెద్ద ఎత్తున పడుతోంది. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి 4 లేబర్ కోడ్‌లుగా మారుస్తోంది. దేశీయ రంగానికి నష్టం కలిగించేలా విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. మోడీ ప్రభుత్వం కార్మికవర్గానికే కాక దేశంలోని రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు కూడా నష్టం కలిగించే విధానాలను అవలంబిస్తోంది. గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆత్మహత్యలు చేసుకొనే దుస్థితి నెలకొంది. పెట్రోలు, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుతూ లక్షలాది కోట్ల రూపాయల పన్నుల భారాన్ని ప్రజలపై మోపుతోంది. ఈ విధానాలను నిరసిస్తూ సిఐటియు, ఆలిండియా కిసాన్‌సభ, అఖిల భారత కార్మిక సంఘాలు ఆగస్టు 9 జైల్ భరో, ఆగస్టు 14న సామూహిక జనజాగరణ, సెప్టెంబర్ 5న చారిత్రాత్మక కార్మిక-కర్షక సంఘర్ష్ ర్యాలీలను ఢిల్లీలో 3 లక్షల మందితో నిర్వహించాయి. పెట్రోలు, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సెప్టెంబర్ 10న భారత్ బంద్‌ను పాటించాయి.

మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు నష్టం కలిగించేలా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఆర్థిక రంగంలోనూ మార్పులు తెచ్చింది. పెద్ద నోట్లరద్దు, జీఎస్టీ, ప్రభుత్వ రంగ బ్యాంకులను నాశనం చేసేలా ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం తదితర విధానాలను అవలంబిస్తోంది. వాటిని నిరసిస్తూ కార్మికవర్గం జనవరి 8-9 తేదీల్లో నిర్వహించే సార్వత్రిక సమ్మెకు అందరూ మద్దతు తెలపాలి. మనరాష్ట్రంలోనూ చంద్రబాబు ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా పాలన సాగిస్తోంది. 50 లక్షల మంది కార్మికులకు సంబంధించిన షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో ధరలకునుగుణంగా కనీసవేతనాలను పెంచకుండా, కొన్నింటిలో తగ్గిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ విధానాలను కార్మికవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసి, జనవరి 8-9 తేదీల సమ్మెను కోట్లాది మందితో జయప్రదం చేయడమే కార్మికవర్గ తక్షణ తప్పనిసరి కర్తవ్యం.





అసలు తుఫానే రాకుండా హ్యాండిల్ చేయొచ్చుగా
అని అడుగుతున్నాడ్సార్!!

ఈ సమాజంలో ఉన్నందుకు సిగ్గేస్తోంది

ఈ సమాజంలో ఉన్నందుకు సిగ్గేస్తోంది
ఈ వ్యవస్థను జూస్తే ఉమ్మాలనుంది
మా గర్భగుడి నుండి పుట్టినోళ్లే
ఆ గుడిలోకి అడుగెట్టొద్దంటే,
మా పేగు తెంచుకుని పుట్టిన్నోళ్లే
పాశవికంగా మమ్ము పక్కకు తోసేస్తుంటే,
మా వొడిలో కథలు విన్నోళ్లే
కట్టుకథలిని మాపై కషాయం కక్కుతుంటే
మా కొంగుముడులు పట్టుకు తిరిగినోళ్లే
మూఢత్వ ముసుగులో విషం చిమ్ముతుంటే,
మావొళ్లో బడి పాఠాలు నేర్చుకున్నోళ్లే
ఆ గుడ్డి పాఠాలిని గుళ్లోకి రావొద్దంటే,
మా పొట్టలో నుండి పుట్టినోళ్లే
మమ్ము జుట్టు పట్టుకొని ఈడుస్తుంటే,
నాడు తలుపుతట్టి అమ్మా ఆకలి అన్నోళ్లే
నేడు వెళ్లవమ్మాని తలుపు మూసేస్తుంటే,
మా చనుబాలు తాగి పెరిగినోళ్లే
మా హక్కులపై ఉక్కు సంకెళ్లేస్తుంటే,
మా గర్భగుడి నుండి పుట్టినోళ్లే
ఆ గర్భగుడిలోకి రావొద్దంటే,
ఈ సమాజంలో ఉన్నందుకు సిగ్గేస్తోంది
ఈ వ్యవస్థను జూస్తే ఉమ్మాలని ఉంది
ఆ దేవుడు కూడా ఓ అమ్మ
కడుపునుండే పుట్టలేదా ?
మా అడుగుతో మైలపడే దేవుళ్లు,
మమ్ము చూస్తేనే చలించే
దేవుళ్లు, మీరునూ !
మైల వున్న ఉదరంలోనే ఊపిరి పోసుకోలేదా ?
మలినమున్న పొట్టలోనే పిండమై ఉండలేదా ?
బహిష్టును సాకుగా జూపి
మమ్మల్ని బహిష్కరించ జూస్తున్నరే !
మేం చేసిన పాపమేంటి ?
మాకే ఈ శాపమేంటి ?
మేం చేసిన నేరం ఏంటి?
మాపై ఈ ఘోరమేంటి?
మేం లేకుండా మీ జన్మలేదని,
ఈ సృష్టే లేదని గ్రహించండి
మా ఆవేదనను ఆలకించి,
మమ్ములను మనుషులుగా గుర్తించండి.
ఆహా మేం మలినమైతే,
మేం పాదం మోపితే గుళ్లు మలినమైతే,
మరీ ఆ మలినం నుండి పుట్టిన
ఆ గుడి కట్టినోళ్లు ,
గుడిలో ఉన్నోళ్లు,
గుడికెళ్తున్నోళ్లు మలినస్తులే కదా!
అలాంటప్పుడు మమ్ము మాత్రమే
రావొద్దంటారెందుకు?
ఛీ పొమ్మంటారెందుకు?
అడుగు పెట్టొద్దంటారెందుకు?
అందుకే నాటి నుండి నేటి వరకు
మమ్మల్ని అడుగడుగునా
అణచివేస్తూ,అవమానిస్తున్న
తీరులు జూస్తే అసహ్యామేస్తోంది
ఈ సమాజంలో ఉన్నందుకు సిగ్గేస్తోంది
ఈ వ్యవస్థను జూస్తే ఉమ్మాలనుంది.

- యంబడి ఈశ్వరయ్య



డాక్టర్... డాక్టర్...

వ్యాధి నిరోధక ఆహారం

రుతువులను బట్టి రకరకాల వ్యాధులు వస్తుంటాయి. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే మొత్తం అందరికీ సోకుతుందేమోనన్న భయం, వేలకు వేల రూపాయలు ఖర్చువుతాయన్న బెంగ సగటు మనిషిని పీడించే ఆలోచనలు. గత ఏడాది ప్రారంభంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, డెంగీ వ్యాధులు మళ్లీ జడలు విప్పుతాయోమోననే భయం ప్రజలను వణికిస్తోంది. ఇలా సీజన్‌లో వచ్చే వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవటంలో ఎన్నో మెలకువలు పాటించాల్సిన అవసరం ఉంది. శరీరంలో రోగ నిరోధక శక్తి బలంగా ఉంటే హెచ్ 1, ఎన్1, వర్షాకాల వైరస్‌లు ఏమీ చేయలేవని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వంటింట్లో లభించే అల్లం, వెల్లుల్లి, తేనె, మిరియాలు, కూరగాయలను క్రమం తప్పకుండా ఆహారంలో ఉండేట్లు చూసుకోవటం తప్పనిసరి అంటున్నారు. ఇలాంటి వ్యాధి నిరోధక ఆహార పదార్థాలపై వైద్య నిపుణులు అనేక సూచనలు చేస్తున్నారు.

వెల్లుల్లి: ఎలాసీన్ అనే పదార్థం వెల్లుల్లిలో పుష్కలంగా ఉంటుంది. ఇది యాంటీ ఫంగస్, యాంటీ బాక్టీరియాగా పనిచేస్తుంది. వైరస్ నిరోధక గుణాలు కూడా ఎక్కువే. ఆహారంలో రోజు వెల్లుల్లి తీసుకుంటే కాలేయం శుభ్రపడుతుంది. తెల్ల రక్త కణాల ఉత్పత్తి అధికమ వ్వడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగు తుంది. వీటిని సాధారణంగా కూరల్లోనే వాడాలి తప్పితే ప్రత్యేకించి ఔషధ రూపంలో తీసుకోకూడదు. పిల్లలయితే రోజుకు రెండు నుంచి 5 వెల్లుల్లి రెబ్బలు, పెద్దలు మరి కొన్ని ఎక్కువగా తీసుకోవాలి. ఈ సీజన్‌లో కూరలు, పప్పులు, పచ్చళ్లల్లో వెల్లుల్లి మోతాదు పెరగాలి. పిల్లలు భోజనం చేసే సమయంలో వీటిని పక్కన పడేయకుండా చూడాలి. ఫ్రూట్ జ్యూస్‌లో కూడా తీసుకోవచ్చు.



అల్లం: ఇందులో చాలా ఔషధ గుణాలున్నాయి. ఇందులో ఉండే ఓల్టెయిన్ నూనె శరీరంలో వేడిని పెంచి హానికర పదార్థాలను చెమట రూపంలో బయటకు పంపిస్తుంది. జ్వరాన్ని నివారిస్తుంది. అల్లం తీసుకుంటే శరీరంలో మ్యాకస్ అనే పదార్థం ఉత్పత్తి అయి ఊపిరి తిత్తుల పనితీరు మెరుగవుతుంది. శ్వాస సులభంగా ఉంటుంది. అల్లాన్ని చాలా రకాలుగా తీసుకోవచ్చు. ఉదయం అల్లం తినే అలవాటు మంచిది. కూరల్లోనూ అల్లం రసం వాడొచ్చు. అల్లం టీ, అల్లం మురబ్బా, అల్లం క్యాండీ తాగితే మంచిది. ఒక టీ స్పూన్ అల్లం రసం, 10 గ్రాముల మెంతులు తేనెలో వేసి మరిగించిన నీటిని తీసుకోవచ్చు. సొంఠిని టీ, పాలల్లో వేసుకుని తాగొచ్చు.

తేనె: ప్రకృతిలో లభించే తేనె యాంటీ బయోటిక్, యాంటీ సెప్టిక్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు, అంటు వ్యాధులను తట్టుకోవటానికి, నియంత్రించటానికి అవసరమయ్యే ఖనిజ లవణాలు, విటమిన్లు పుష్కలంగా తేనెలో ఉంటాయి. ఎలర్జీ, ఆస్థమా, నివారణకు కూడా ఉపయో గపడుతుంది. న్యూజిల్యాండ్‌లో లభించే మెనాకో తేనెకు ప్రత్యేక గుణాలున్నాయి. ఎమ్ఆర్ఎస్ఐ అనే బ్యాక్టీరియాను అరికడటంతో పాటు దాని ఫలితంగా వచ్చే దగ్గు, పడిశం, ఫ్లూ నివారణ అవుతుంది. ఉదయం లేవగానే 2 టీ స్పూన్ల తేనె తీసుకోవచ్చు. గోరువెచ్చ నీటిలో రెండు చెంచాల తేనె, నాలుగు టీ స్పూన్ల నిమ్మరసం కలిపి తీసుకోవాలి. ఉదయం పాలు, చపాతితో పాటు తేనె తీసుకుంటే మేలు.

మిరియాలు: మిరియాల్లో ఔషధ విలువలు అధికంగా ఉంటాయి. పలు దుకాణాల్లో ఇవి లభిస్తాయి. వీటిలో విటమిన్లు, రక్తప్రసరణ, జీర్ణ వ్యవస్థపై మంచి ప్రభావం చూపుతాయి. జలుబు, ఫ్లూ జ్వరాలు ఉన్నప్పుడు వీటిని ఆహారంతో పాటు తీసుకోవటం మంచిది. మిరియాల పొడిని పాలల్లో, రసంలో వేసుకొని తీసుకోవచ్చు. ఫ్లూ బారిన పడ్డవారు రోజుకు మూడు సార్లు రెండు చెంచాల తేనె, ఒక చెంచా అల్లం రసం కలిపి తీసుకుంటే మేలు.

పెరుగు: ఇందులో ఉండే ఎసిడో పిల్లర్స్, బిఫిడస్ శరీరానికి మేలు చేసే బ్యాక్టీరియాను అభివృద్ధి చేస్తాయి. విటమిన్ కే రోగ నిరోధక శక్తి వృద్ధికి దోహద పడు తుంది. రోజూ పిల్లలు, పెద్దలు 100 మిల్లీ లీటర్ల పెరుగు తీసుకోవాలి.

ఆకు కూరలు: వర్షాకాలంలో పాలకూర, మెంతి కూర, బచ్చల కూరలను ఎక్కువగా వాడాలి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. రోజూ ఆకుకూరలను పప్పు కాంబి నేషన్‌తో తీసుకుంటే మంచిది. పాలక్ పన్నీరు, వెజిటబుల్ సలాడ్స్, సూప్స్ వారానికి నాలుగుసార్లు తప్పనిసరిగా తీసుకుంటే మంచిది.

వినిమయ ధరల సూచిక (బేస్ 2001=100) 2018

సెంటర్ సిరీస్	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబర్
ఆల్ ఇండియా	291	301	301	301
గుంటూరు	280	284	284	282
విశాఖపట్నం	284	288	289	291
విజయవాడ	278	284	285	285
హైదరాబాద్	250	253	253	253
రాష్ట్ర సిరీస్	**ఏప్రిల్**	**మే**	**జూన్**	**జూలై**
విజయనగరం	292	293	295	299
రాజమండ్రి	297	299	301	305
జగ్గయ్యపేట	319	320	322	326
తిరుపతి	289	290	291	294
ఏ.పి	289	290	291	295

లింకింగ్ ఫ్యాక్టర్	1971=100	1960=100	1982=100
ఆల్ ఇండియా	-	4.93	4.63
హైదరాబాద్	-	5.23	4.79
గుంటూరు	-	5.60	4.57
విశాఖపట్నం	2.48	1.87	4.64
విజయవాడ	-	-	4.28
విజయనగరం	-	-	3.93
కాకినాడ	2.55	1.81	4.26
జగ్గయ్యపేట	-	-	4.28
తిరుపతి	-	-	4.57

పాఠకులకు విజ్ఞప్తి

'కార్మికలోకం'పై మీ స్పందనను ఆహ్వానిస్తున్నాం. పత్రికలోని వ్యాసాలు, వార్తలు, వ్యాఖ్యలపై మీ అభిప్రాయాలు నిర్మొహమాటంగా రాసి పత్రిక అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. లేఖలతో పాటు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కూడా పంపగలరు.

అడ్రస్ : నండూరి ప్రసాదరావు భవన్, 24-24-14, రజకవీధి, దుర్గాపురం, విజయవాడ-520003.
ఫోన్ : 9494899322, 9490098022, e-mail : karmikalokam@gmail.com,

సర్క్యులేషన్ వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు:
9490098022, 9494899322
కొత్త చందాలు కట్టేవారు, పాతవి పునరుద్ధరించుకొనే వారు డబ్బును యూనియన్ బ్యాంక్, విజయవాడ పేరుతో పంపించగలరు.
Karmika Lokam A/c No. : 448802010000833
(IFSC : UBIN0534641), Governorpet Branch, Vijayawada.

రచయితలకు సూచన

'కార్మికలోకం' పత్రికకు రచనలను ఆహ్వానిస్తున్నాం. కార్మికుల జీవితానికి సంబంధించిన కథలు, కవితలు, వాస్తవ జీవిత చిత్రణలు పంపించొచ్చు. కార్మికులను కదిలించే వాటికి ప్రాధాన్యత. రచనలను 20వ తేదీలోపు 'కార్మికలోకం' మెయిల్ లేదా పోస్టల్ అడ్రసుకు పంపించ మనవి.

- ఎడిటర్





కవర్ పేజీ కథనం

నిర్బంధాలను ఎదుర్కొని సాగిన మున్సిపల్ కార్మికుల పోరాటం

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం మున్సిపల్ పరిపాలనలో తీసుకువస్తున్న సంస్కరణలకు వ్యతిరేకంగా 13 రోజులపాటు జరిగిన మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె జరిగింది. మూడు సంవత్సరాలుగా కార్మికులు వివిధ రూపాల్లో ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తున్నారు. విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, నెల్లూరు, నందిగామ, జగ్గయ్యపేటలలో దీర్ఘకాలిక సమ్మెలు



జరిగాయి. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె అక్టోబర్ 4 నుండి 16 వరకు జరిగింది. రాష్ట్రంలోని ఒకటి, రెండు స్వతంత్ర సంఘాలు మినహా మిగిలిన అన్ని సంఘాలు ఒకే వేదిక మీదకు వచ్చి సాగిం చిన పోరాటం ప్రభుత్వం మెడలు వంచి విజయం సాధించింది. కార్మిక సంఘాలతో చర్చలు జరిపేదేలేదని తెగేసి చెప్పిన ప్రభు త్వం, కార్మికుల పోరాటానికి తలవంచక తప్ప లేదు. 279 జీఓను ఆరు నూరైనా అమలు చేయాలని మొండి పట్టుదలతో ఉన్న ప్రభుత్వానికి ఈ సమ్మె పోరాటం కళ్లెం వేసింది. రెండు, మూడు ఏళ్లుగా పెండింగ్ పెడుతున్న జీతాల పెంపు సమస్యకు పరిష్కారం చూపింది.

ప్రస్తుతం అమలులో ఉన్న వర్కర్స్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వర్క్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని ప్రభుత్వం రంగంలోకి తెచ్చింది. ఈ రెండు విధానాలు ఒకటే అని ప్రభుత్వం వాదించింది. అది వాస్తవం కాదు. వర్కర్స్ ఔట్‌సోర్సింగ్ విధానంలో కాంట్రాక్టర్ ప్రమేయం ఎంత మేరకు అంటే కార్మికులను మున్సిపాలిటీలకు అప్పగించడం వరకే. అందుకు అతనికి మున్సిపాలిటీ 5 శాతం కమీషన్ ఇచ్చేది. కాని వర్క్ఔట్‌సోర్సింగ్ అంటే పని మీద, కార్మికుల జీత భత్యాల మీద మొత్తం పెత్తనం అప్పగించబడుతుంది. మొత్తం పెత్తనంతో పాటు కమీషన్ కూడా 5 నుంచి 10 శాతంకి పెంచి ఇవ్వబడుతుంది. కార్మికులను కాంట్రాక్టర్ మనుషులే మస్టర్లు వేస్తారు. జీత భత్యాలు వారి ద్వారానే చెల్లించ బడతాయి. కార్మికుల నియామకం, తొల గింపు అంతా వారి కనుసన్నల్లోకి పోతుంది. ఈ తేడాను కప్పిపుచ్చి రెండు విధానాల్లో తేడా లేదని రాష్ట్ర ప్రభుత్వం నమ్మబలుకుతోంది. ఈ విషయాల గురించి కార్మికులను చైతన్య పరుస్తున్న కార్మిక నాయకులపై బురద జల్లే పని చేస్తోంది. కార్మికుల మేలు కోసమే 279 జీఓ తెచ్చామని ప్రభుత్వం కరపత్రాలు వేసి ప్రజలకు పంచి పెట్టి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించింది. స్వచ్ఛ సంకల్పం, స్వచ్ఛ సర్వేక్షణల పేరుతో సంస్కరణల విషాన్ని జనంతో మింగించడానికి ప్రయత్నించింది. మున్సిపల్ కార్మికులు తమను మున్సిపాలిటీ నుండి గెంటివేసి దళారీలకు అప్పగిం చవద్దని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్, మలేరియా విభాగాల వారికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు తదితర డిమాండ్లను మూడేళ్లుగా పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం కార్మికులు కోరుతున్నది వదిలేసి తమను బానిసలుగా మార్చే సంస్కరణలను ఒప్పుకోవాలని కార్మికులపై ఒత్తిడి చేసింది. గత మూడేళ్లలో అందుకోసం పై నుండి కింది వరకూ జిల్లా, రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులు కలెక్టర్ల సమావేశాలు నిర్వహించింది. కార్మికుల నిరసనను పెడ చెవిని పెట్టి బలవంతంగా సంస్కరణలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒంటెత్తు పోకడలు పోయింది. వేతనాలకు సంబంధించిన ప్రభుత్వ హామీలను అమలు చేయాలంటే 279 జీఓ కు అడ్డు పడరాదని షరతులు విధించింది. పదే పదే చర్చల పేరుతో కాలయాపన చేసింది. ప్రభుత్వ సాచివేత ధోరణి కార్మికుల ఆగ్రహానికి కారణం అయ్యింది.

కార్మిక సంఘాల అనైక్యతను ఆసరా చేసుకొని కార్మికులను బానిసలుగా మార్చాలని ప్రభుత్వం వేసిన కుట్రలను కార్మిక సంఘాలు సాగనివ్వలేదు. రాష్ట్రంలోని 40 వేల మంది కార్మికులను ఏకతాటిపైకి తెచ్చి ప్రభుత్వ ఆశలను వమ్ము చేయడాన్ని ప్రభుత్వం సహించలేకపోయింది. సమ్మె ప్రారంభానికి ముందు రోజు నుండే కలెక్టర్లకు, పోలీసు ఉన్నతాధికారులకు సమ్మె చేస్తున్న కార్మికులపై ఉక్కుపాదం మోపి అణచివేయాలని తాఖీదులు ఇచ్చింది. పోటీ కార్మికులను రంగంలోకి దించి అడ్డుకునే వారిపై కేసులు పెట్టి జైళ్లకు పంపించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సమ్మె ప్రారంభం రోజు నుండే నిర్బంధాన్ని ప్రయోగించింది. సమ్మెలో పాల్గొంటే ఉద్యోగాల నుండి తొలగిస్తామంటూ బెదిరింపులకు దిగింది. దీనిని అవకాశంగా తీసుకున్న కొద్ది మంది అధికారులు పోలీసులతో కార్మికులను కొట్టించి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించారు.

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని వర్గ చైతన్యంతో కార్మికులు మొక్కవోని దీక్షతో పోరాడారు. పగలు రాత్రి తేడా లేకుండా పోలీసులతో, పోటీ కార్మికులతో అధికార పార్టీ నాయకులతో తలపడి పోరాటాన్ని కొనసా

గించారు. ఇందులో మహిళా కార్మికులు నిర్వహించిన పాత్ర గర్వించదగినది. ఇతర కార్మిక వర్గానికి స్ఫూర్తిని ఇస్తూ మహోద్య మంగా ఈ సమ్మె పోరాటాన్ని నిర్వహించారు. తెలుగుదేశం మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు దళిత, గిరిజన ఇతర ప్రజా సంఘాలు అన్ని ఈ పోరాటానికి మద్దతు ఇచ్చాయి. పట్టణ ప్రజానీకం కూడా కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించడం ప్రభుత్వ మెడలు వంచడానికి తోడ్పడింది. రాజ్యాంగ యంత్రం ఎవరికి కొమ్ముకాస్తుందో, తెలుగుదేశం ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఎంతగా ఊడిగంచేస్తుందో కార్మికులు అర్థం చేసుకోవడానికి ఈ పోరాటం తోడ్పడింది.

సమ్మె పోరాటం - సాధించిన విజయాలు: జీఓ నెం.279 పైన రాష్ట్ర ప్రభుత్వం చాలా మొండిగా ఉంది. ముప్ఫై ఏళ్లుగా చంద్రబాబు నాయుడుగారు తాను అనుసరిస్తున్న సంస్కరణల విధానాల నుండి వెనక్కి తగ్గేది లేదని జీఓ రద్దు చేయడానికిగాని, కనీసం మూడు నెలలు వాయిదా వేయడానికి కూడా అంగీకరించలేదు. ఏమాత్రం వెనుకడుగు వేయడానికి సిద్ధంకాకపోగా వేగంగా అమలు చేయాలనే ప్రభుత్వ దూకుడుకు సమ్మె పోరాటం కళ్లెం వేయగలిగింది. అమల వుతున్న ప్రాంతాల్లో కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలపై చర్చించి పరిష్కరిం చేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీలు వేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. సమ్మెకు ముందు ఉన్న పరిస్థితి నుండి ముందుకెళ్లబోమని ప్రభుత్వం ఒప్పుకుంది. కార్మికులకు పని ప్రదేశాల్లో కాకుండా మస్టర్ పాయింట్లలలోనే మస్టర్ వేయడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లతోనే మస్టర్ వేసేట్లు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీనిచ్చింది. కార్మికుల ఉపాధి భద్రత, వేతన గ్యారంటీ, ప్రధాన యజమా నిగా మున్సిపల్ కమీషనర్ ఉండేట్లు, పీఎఫ్, ఈఎస్ఐ పథకాలకు రక్షణ కల్పించే విధంగా ఉత్తర్వులు జారీ చేయడానికి ప్రభుత్వం అంగీ కరించింది. అయినా 279 జీఓ ను రద్దు చేయాలని కార్మిక సంఘాలు పునరుద్ఘా టించాయి.

వేతన పెంపునకు సంబంధించి: కార్మికులకు 151 జీఓ ప్రకారం వేతనాలను 2018 సెప్టెంబర్ నుండి రూ.11 వేలు నుండి రూ.12 వేలకు పెంచి చెల్లిస్తారు. నగర పంచాయితీల్లో రూ.10 వేల నుండి రూ.12 వేలకు వేతనాలు పెరుగుతాయి. దీనితోపాటు గతంలో ఎన్నడూ లేని విధంగా 15 నెలల ఎరియర్స్ ఇన్సెంటివ్ రూపంలో రూ.15 వేలను కార్మికుందరికీ డిసెంబ ర్‌లోగా చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఇది కాక జీఓ నెం.142 లోని జీతాలను పారిశుధ్య కార్మికులకు, ఇంజినీరింగ్ కార్మి కులకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదిం పచేసి మూడు నెలల్లో వేతనాలను చెల్లించేం దుకు ప్రభుత్వం ఒప్పుకుంది. ఇది అమల్లోకి వస్తే ఒక్కో కార్మికుడికి (వేతనం + కరువు భత్యం) రూ.16,300/- రావాల్సుంటుంది.

ఇంజినీరింగ్, మలేరియా కార్మికులకు వారి నైపుణ్యానికి తగిన విధంగా స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల అమలుకు రెండు వారాల్లోగా జీఓ ను జారీ చేస్తామని ప్రభుత్వం అంగీకరిం చింది. దీనిలో మలేరియా, టౌన్ ప్లానింగ్ చైన్ దళం, నాన్ టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, హెవీ వెహికల్ డ్రైవర్ల జీతాల విషయంపై అక్టోబరు 26న చర్చ జరిపి ఫైనల్ చేయాలని అంగీకారం కుదిరింది.

మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, టాయిలెట్ వర్కర్లు, ట్రైసైకిల్ కార్మికులకు: వీరికి మూడు నెలల్లోగా పారిశుధ్య కార్మికులతో సమానంగా జీతాలు పెంచి చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేసేం దుకు అంగీకారం కుదిరింది. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిలో అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపులో ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది. సమ్మె కాలం జీతం చెల్లించేందుకు, కేసులు ఎత్తి వేయడానికి ప్రభుత్వం మౌఖికంగా అంగీకరిం చింది. ఏవిధమైన కక్ష సాధింపు చర్యలు కొనసాగించబోమని అందర్నీ విధుల్లోకి తీసుకుంటామని ప్రభుత్వం హామీయిచ్చింది.

పర్మినెంట్ కార్మికులకు జీపిఎఫ్ ఎకౌంట్లు ప్రారంభించడానికి ఈ పాటికే ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన కమిటీలతో కార్మిక సంఘాల ప్రతినిధులను కూడా చేర్చేందుకు అంగీకారం కుదిరింది. ఎకౌంట్లు త్వరలో ప్రారంభిస్తారు. హెల్త్ కార్డులకు సంబంధించి కార్డులు ఇచ్చేలోగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లైమ్‌లు పరిష్కరిం చేందుకు అంగీకారం కుదిరింది.

విజయవాడ, విశాఖ నగరాలకు 010 పద్దు కింద జీతాలు ఇచ్చేందుకు ప్రక్రియ కొనసాగుతుంది. త్వరలో జీఓ జారీ చేయ డానికి ప్రభుత్వం అంగీకరించింది.

గతంలో కంటే ఈ సారి సమ్మెలో నిర్దిష్ట మైన కాలపరిమితిలో సమస్యలు పరిష్కరిం చేట్లు ఉత్తర్వులు జారీ చేసే విధంగా ప్రభు త్వంపై ఒత్తిడి తీసుకురాగలిగారు. ఇదే ఈ సమ్మె పోరాటం ప్రత్యేకత. ఇది కార్మికులు సాధించిన విజయం. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే మున్సిపల్ కార్మికులకు తెలిసింది ఒక్కటే, అదేమిటంటే పోరాటం చేయడం ద్వారానే ప్రభుత్వాన్ని దారికి తెచ్చుకోగలమని, కొన్నైనా రాయితీలను, హక్కులను సాధించు కోగలమని వారి జీవితానుభవం రుజువు చేస్తున్నది.

- కె.ఉమామహేశ్వరరావు

-※-※-※-

రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణం

బీజేపీ 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అవినీతిపై యుద్ధం ప్రకటించింది. 2జీ స్పెక్ట్రం, బొగ్గు గనుల కుంభకోణాలను ఎలుగెత్తి చాటింది. కాంగ్రెస్ ఓటమికి ఇతర కారణాలతో పాటు అవినీతీ ముఖ్య పాత్ర పోషించింది. నేడు రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ద్వారా అతి పెద్ద కుంభకోణానికి బీజేపీ తెరలేపింది. బూర్జువ పార్టీలేవీ కుంభకోణాలకు అతీతంకాదని బీజేపీ ఎన్నికల్లో తలపడవలసి వచ్చింది. నేడు బీజేపీ ప్రభుత్వం రాఫెల్ కుంభకోణం మీద తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ప్రపంచంలోగానీ, భారతదేశంలోగానీ నీతివంతంగా పరిపాలన చేయడం వామపక్షాలు, కమ్యూనిస్టులకే సాధ్యమని రుజువైంది. భారతదేశంలో ప.బెంగాల్లో 33 ఏళ్లు సీపీఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం, 25 ఏళ్లకు పైగా కేరళ, త్రిపుర



మరోసారి విస్పష్టంగా రుజువుచేసింది. బడా పెట్టుబడిదారుల అనుకూల ప్రభుత్వాలు ఏవైనా వారికి తలొగ్గి అవినీతిలోకి కూరుకుపోవడం అనివార్యమని అర్థమౌతుంది.

బీజేపీ తాము నిజాయితీపరులమని బాకాలూదుకోవడం ఒట్టి బూటకమని తేలింది. దేశీయ పెట్టుబడిదారులు, విదేశీ పెట్టుబడిదారులతో లాలూచీపడి అధికారంలో వున్న పార్టీలు దేశద్రోహానికి పాల్పడంలో వెనుకాడరని నాటి కాంగ్రెస్ బోఫోర్స్ కుంభకోణం, నేటి రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణం తేటతెల్లంచేశాయి. ఈ రెండు ఒప్పందాలూ రక్షణరంగానికి సంబంధించినవ్వడం ప్రజలను ఆశ్చర్యపరిచింది. అందుకే ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ సంవత్సరం ముందు రాజీనామా చేసి ప్రభుత్వాలు అవినీతి మచ్చలేకుండా పరిపాలించాయి. బోఫోర్స్ కుంభకోణం వార్త మొదట స్వీడన్ రేడియో స్టేషన్ ద్వారా బయటకు వచ్చింది. 29 ఏళ్ల తరువాత ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు హోలండే ఇంటర్వ్యూ ద్వారా రాఫెల్ కుంభకోణం రచ్చకెక్కింది. విదేశాల్లోని ఈ రెండు కుంభకోణాలు బయటపడ్డాయి. ఆనాడు బోఫోర్స్ కుంభకోణాన్ని 'ది హిందూ' పత్రిక యజమాని ఎన్.రామ్ స్వయంగా పరిశోధన చేసి సంపూర్ణ వివరాలను వెలికితీశారు. గల్లీగల్లీ మే చోర్‌హై, రాజీవ్‌గాంధీ చోర్‌హై అనే నినాదం దేశమంతా మారుమోగింది. దేశభక్తి పదేపదే వల్లివేసే బీజేపీ దేశద్రోహాన్ని కూడా దేశ ప్రజలు రాఫెల్ కుంభకోణం ద్వారా అంతకుంటే అసహ్యించుకొనే రోజులు రాబోతున్నాయి.

రాఫెల్ ఒప్పందం ఏమిటి?

20012లో యూపీఏ ప్రభుత్వం ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ ఫైటర్ జెట్స్ కొనుగోలును ఆమోదించింది. ఇందులో 18 విమానాలను ఈ కంపెనీ నుండి కొనాలని నిర్ణయించారు. దాంతో పాటు భారత ప్రభుత్వరంగ సంస్థ హిందుస్తాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్‌లో (హెచ్ఏఎల్, బెంగుళూరు) 108 విమానాలను అదే టెక్నాలిజీతో అమర్చుకోవాలని కూడా ఆమోదించారు. అయితే ఈ ఒప్పందాలు తుది దశలో ఉండగా లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. యూపీఏ ఓడిపోయింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని తిరగరాయాలని నిర్ణయించుకుంది.

126 విమానాలకు బదులుగా 36 రాఫెల్ విమానాలు డసాల్ట్ కంపెనీ నుంచి కొని మిగిలిన విమానాలను ఇండియాలో 'మేక్ ఇన్ ఇండియా' విధానం ద్వారా ఉత్పత్తి చేయనున్నట్లు బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. 2015లో మోడీ ఫ్రాన్స్ దేశ పర్యటనలో అంతకుముందు యూపీఏ ప్రభుత్వంతో జరిగిన రాఫెల్ డీల్‌ను రద్దు చేశారు. 2016 జనవరిలో రాఫెల్ డీల్ డసాల్ట్ కంపెనీ ఆర్డర్‌ను బీజేపీ ప్రభుత్వం నిర్ధారించింది. 2016 సెప్టెంబర్‌లో ప్రధాని మోడీ ఫ్రాన్స్ పర్యటించారు. 36 విమానాలకు రూ.58,000 కోట్లు (7.8 బిలియన్ యూరోలు) ఇందులో 15% అడ్వాన్సుగా ఇవ్వాలని ఈ పర్యటనలో నిర్ధారించారు. ఒప్పందంలో భాగంగా స్పేర్‌పార్ట్‌లు, ఇతర యంత్ర సామాగ్రి సరఫరా కూడా అంగీకరించారు. అయితే 2012లో అంగీకరించిన కీలకమైన టెక్నాలజీ బదిలీ ఈ ఒప్పందంలో లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ముందు ఒప్పందంలో 18 విమానాలే

కొనాలని నిర్ణయించగా మోడీ దానిని 36 రాఫెల్ విమానాల కొనుగోలుకు అంగీకరించారు.

రాఫెల్ ఒప్పందంలోని కుంభకోణం: 2012లో యూపీఏ ప్రభుత్వం విమానం ఖరీదు రూ.537 కోట్లుగా అంగీకరించింది. దానిని బీజేపీ ప్రభుత్వం సుమారు రూ.1700 కోట్లకు కొనాలని నిర్ణయించింది. మూడురెట్లు అమాంతంగా పెంచడం వెనుక కమీషన్లు ముడుపులే కీలకమని ఎవరికైనా ఇట్టే అర్థమౌతుంది. ఆయుధాల కొనుగోలు ఎవరి ద్వారా జరగాలని డసాల్ట్ కంపెనీ అడిగితే రిలయన్స్ కంపెనీ పేరును పైకి తెచ్చాడు నరేంద్రమోడీ.

ఆయుధాల తయారీ అనుభవంలేని అంబానీ కంపెనీ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించారు. అంబానీకి మోడీ కాంట్రాక్టు ఇప్పించారు. విమానం ఖరీదు 3 రెట్లు పెంచి మరీ అంబానీకి అప్పజెప్పారు. బీజేపీ కుట్రను మిలిటరీ నిపుణులు బయట పెట్టారు. హెచ్ఏఎల్ అంతర్జాతీయంగా సమర్థత గల భారత ప్రభుత్వరంగ కంపెనీ. దేశభక్తులు అని చెప్పుకునే బీజేపీ, ఆర్ఎస్ఎస్ దీనిని కాదని ఫ్రాన్స్ వారితో ఒప్పందం ఏమిటి? 108 విమానాలు హెచ్ఏఎల్‌లో తయారీని ఎందుకు ప్రక్కన పెట్టారు? ఇదంతా కాంగ్రెస్ హయాంలో జరిగిందని బీజేపీ బుకాయిస్తోంది. దానికి మీడియా భజన మరో అలంకారం. అత్యంత అవినీతిమయమైన కొనుగోలు ఇది. దేశానికి రూ. 42 వేల కోట్లు నష్టం. లాభం అంతా అంబానీకి, బీజేపీకి మాత్రమే. బోఫోర్స్ కుంభకోణం రూ. 90 కోట్లు అయితే రాఫెల్ కుంభకోణం దానికి 50 రెట్లు అదనం.

ప్రభుత్వరంగ సంస్థ (హెచ్ఏఎల్)కు ద్రోహం: హిందూస్థాన్ ఏరోనిటిక్ లిమిటెడ్ (హెచ్ఎఎల్) కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ. సమర్థవంతంగా దేశ యుద్ధ విమానాలను ఉత్పత్తిచేసిన చరిత్ర ఉంది. 25 టన్నుల

బరువు కలిగిన సుఖోయ్-30, నాలుగో జనరేషన్ యుద్ధ విమానాలను ఉత్పత్తి చేసింది. ఫ్రాన్స్ సంస్థ డసాల్ట్ కంపెనీ సాంకేతిక సహకారం తీసుకొని హెచ్ఐఏల్ 108 యుద్ధ విమానాలను చేయాలని యూపీఏ ప్రభుత్వంలో ఫ్రాన్స్‌తో చర్చలు జరిగాయి. హెచ్ఎఎల్‌తో 90శాతం ఒప్పందం అయినట్లుగా డసాల్ట్ మాజీ సిఈఓ ప్రకటించారు. కానీ 2015 మోడీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ఈ ఒప్పందాన్ని రద్దు చేశారు. రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి, రద్దు చేయడానికి ముందు అనేక దశల్లో చర్చలు జరగాలి. కానీ అటువంటి చర్చలు ఏమీ జరగలేదు. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ముందు బుకాయించింది. ఫ్రాన్స్ మాజీ అధ్యక్షులే బహిరంగంగా ప్రకటించిన తరువాత ఏం మాట్లాడాలో తెలియక గుట్టుచప్పుడు కాకుండా ఉండి పోయారు. యుద్ధ విమానాల తయారీలో రిలయన్స్‌కి ఎటువంటి అనుభవములేదు. మోడీ ఫ్రాన్స్‌లో ఒప్పందం చేసేనాటికి రెలయన్స్ డిఫెన్స్ అండ్ ఏరో స్పేస్ లిమిటెడ్ అనే కంపెనీయే భారతదేశంలో లేదు. అయినా లేని కంపెనీని సృష్టించి మోడీ ప్రభుత్వం ఒప్పందం చేసింది. మోడీ ప్రభుత్వం ఒత్తిడి చేసినందువల్లే హెచ్ఏఎల్‌ను పక్కనపెట్టి రిలయన్స్ అనిల్ అంబానీ కంపెనీని డసాల్ట్ కంపెనీకి భాగస్వామిగా అంగీకరించవలసి వచ్చిందని ఫ్రాన్స్‌మాజీ అధ్యక్షులే స్వయంగా ప్రకటించారు.

బీజేపీ ప్రభుత్వం 'ఒక్క దెబ్బకు రెండు పిట్టలు' అన్న చందంగా హెచ్ఎఎల్ కేంద్ర ప్రభుత్వరంగ కంపెనీని నాశనం చేయడం, బీజేపీ తాబేదారులుగా ఉన్న రిలయన్స్ కంపెనీని యుద్ధ విమానాల ఒప్పందంలో భాగస్వాములను చేయడం వల్ల అన్ని విధాల తమ సొంత ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. భారతదేశ చరిత్రలోనే రక్షణ ఒప్పందాల్లో ఇంత పెద్ద కుంభకోణం జరగడం దేశ ప్రయోజనాలకు పూర్తి వ్యతిరేకం. దేశ భక్తి గురించి పదేపదే వల్లించే బీజేపీ దేశ భక్తి పచ్చిబూటకం. అతి ఎత్తైన పటేల్ విగ్రహాలు ప్రతిష్టించడం, ఎత్తైన జాతీయ జెండాలు దేశమంతటా పెట్టడం దేశ భక్తికాదు. దేశంపట్ల, ప్రజల పట్ల బీజేపీకి ఏనాడు భక్తిగాని చిత్తశుద్ధిగానిలేదు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడరాదని స్వాతంత్ర్య పోరాటంలోనే వాదించిన వీరి చరిత్ర ప్రజలు విస్మరించరు. అందుకే చరిత్రలు కూడా తిరగరాయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాఫెల్ కుంభకోణానికి వ్యతిరేకంగా ప్రజలు, కార్మికవర్గం పెద్దఎత్తున ఉద్యమించడ తక్షణ కర్తవ్యం. బీజేపీ ద్రోహాన్ని పటాపంచలు చేస్తూ జనాన్ని జాగృత పర్చడానికి మనం ఐక్యంగా శక్తిమంతంగా కదలాల్సుంది.

- సీహెచ్.నరసింగరావు

సిఐటీయు రాష్ట్ర అధ్యక్షులు

కేరళ హైకోర్టు తీర్పు కేంద్ర పభుత్వానికి చెంపపెట్టు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సొంతగా మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కొన్ని మాసాల్లోనే తన కార్మిక వ్యతిరేకతను చాటుకుంది. లక్షలాది మంది ఈపీఎఫ్ కార్మికుల పెన్షన్‌కు కోత పడేలా ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ 1995 కు అనేక సవరణలు తెస్తూ 2014, ఆగస్టు 22న నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్‌ను సిఐటియు సహా కేంద్ర కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకించినా మోడీ ప్రభుత్వం ఖాతరు చేయలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్మికులు అప్పుడు కోర్టుల గడపతొక్కారు. అంతిమంగా కేరళ హైకోర్టు 2018, అక్టోబరు 12న ఆ నోటిఫికేషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

పెన్షన్. రూ.6,500/- సీలింగ్ ఉండగా ఎంత పెద్ద ఉద్యోగి అయినా గరిష్టంగా రూ.2,500/- పెన్షన్ మాత్రమే వస్తుంది. వీరికి వచ్చే కనీస పెన్షన్‌ను యూపీఏ ప్రభుత్వం వెయ్యి రూపాయలకు పెంచాలని నిర్ణయించింది. దాన్ని మోడీ ప్రభుత్వం అమలు చేసింది. కానీ దాన్లో అనేక పరిమితులు విధించటంతో ఎక్కువ మంది కార్మికులకు ఆ వెయ్యి రూపాయల కనీస పెన్షన్ కూడా రావటం లేదు. ఆ కాస్త దానికే మోడీ ప్రభుత్వం దేశమంతటా 69 చోట్ల మీటింగులు పెట్టి కేంద్ర మంత్రులను పంపించి కనీస పెన్షన్‌ను పెంచామంటూ ప్రచారం చేసుకుంది.

కాంగ్రెసు నాయకత్వంలోని హయాంలో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న ప్రకాశ్ జవదేకర్ (ప్రస్తుత కేంద్ర బీజేపీ మంత్రి) కనీస పెన్షన్‌ను రూ.3 వేలు పెంచాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెసు మీద వచ్చిన అసంతృప్తిని వినియోగించుకుని అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ 2014లోనే ఈపీఎస్ పెన్షనర్లకు మొండి చేయిచూపింది. ఉన్నదాన్ని కూడా పోగొట్టుకునే విధంగా ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్‌కు సవరణలు చేసింది. 2014 ఆగస్టు 22న ఎప్పటి నుండో నలుగుతున్న పెన్షన్‌కు అర్హత ఉండే వేతన సీలింగ్‌ను రూ.6,500 నుండి రూ.15 వేలకు పెంచుతూ ఈపీఎఫ్ పథకానికి సవరణలు చేసి నోటిఫికేషన్ ఇచ్చింది. అదే చేత్తో అదే రోజున ఎంప్లాయీస్ పెన్షన్ పథకానికి (ఈపీఎస్) కూడా సవరణలు చేస్తూ మరో నోటిఫికేషన్ ఇచ్చింది. ఎంప్లాయీస్ పెన్షన్ పథకానికి సవరణలు చేస్తూ ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌నే 2018 అక్టోబరు 12న కేరళ హైకోర్టు కొట్టి వేసింది.

అసలే ఈపీఎఫ్ పెన్షన్ చాలా తక్కువ. అది ఇందిరమ్మ పెన్షన్ల (టీడీపీ ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసాగా మార్చింది)తో పోటీ పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ పరిశ్రమలు, కార్పొరేషన్లు, సహకార సంస్థల్లోని అధికారుల దగ్గర నుండి కింది స్థాయి కార్మికులకు, ప్రైవేటు పరిశ్రమల్లోని కార్మికులకు, బీడీ కార్మికులతో సహా ఇతర అసంఘటిత కార్మికులకు ఇదే ఆసరా. దీని మీద డీఏ ఉండదు. ఎదుగూ బొదుగు లేని

యూపీఏ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా అనేక సౌకర్యాలను ఎత్తివేసింది. కమ్యుటేషన్, కాపిటల్ రిటర్న్ (కొంత పెన్షన్ తగ్గించుకుంటే ఒకేసారి పెద్ద మొత్తం ఇవ్వటం) సౌకర్యాలు ఎత్తివేసింది. 58 సంవత్సరాల్లోపు పెన్షన్ తీసుకునే వారికి సంవత్సరానికి తగ్గించుకునే పెన్షన్ 3 నుండి 4 శాతానికి పెంచింది. ఈపీఎస్ కనీస పెన్షన్‌ను పెంచాలని పెన్షనర్లు ఎప్పటి నుండో పోరాడుతున్నానార్నరు. యూపీఏ

ఈపీఎస్ సవరణతో పెన్షనబుల్ వేతనానికి అదివరలో ఉన్న ఆఖరి 12 నెలల సరాసరిని 60 నెలల సరాసరికి పెంచింది. వచ్చే కాస్త పెన్షన్ కూడా దానితో తగ్గిపోతుంది. 1996 సవరణ ప్రకారం ఉభయులు అంగీకరిస్తే సీలింగుకు మించిన వేతనం పై కూడా యజమాని కట్టిన వాటాలో 8.33 శాతాన్ని పెన్షన్ ఫండ్‌కు మళ్లించాలి. ఈపీఎఫ్‌లో 2014 సెప్టెంబరులో చేసిన సవరణ ప్రకారం పీఎఫ్‌కు సీలింగు వేతనం రూ.15 వేలు పెరిగింది. పెన్షన్‌కు సంబంధించి ఉన్న సీలింగు రూ.6,500 ను రూ.15

వేలకు మార్చాల్సిన ప్రభుత్వం ఆ నిబంధనను పూర్తిగా తొలగించి మరో నిబంధనను చేర్చింది.

కొత్త నోటిఫికేషన్ ప్రకారం రూ.6,500 సీలింగ్‌కు మించి చెల్లింపులు చేస్తున్నవారు, కొత్త సీలింగు రూ.15 వేలకు మించి కూడా చెల్లింపులు కొనసాగాలంటే 2014 సెప్టెంబరు 1 నుండి 6 నెలల లోపు, మరలా కొత్తగా యజమాని, కార్మికులు సంయుక్తంగా అంగీకారం తెలపాలి. రూ.15 వేలకు మించిన మొత్తం పై కార్మికులు అదనంగా 1.16 శాతం చెల్లించాలని చెప్పింది.

ఈపీఎస్‌కు చేసిన ఈ సవరణలు మొత్తం చెల్లవని 2018 అక్టోబరు 12న హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పు పర్యవసానంగా ఆఖరు 60 నెలల సరాసరి వేతనం పోయి ఆఖరి 12 నెలల సరాసరి ఆధారంగానే పెన్షన్‌కు అర్హమయ్యే వేతనం నిర్ణయించబడుతుంది. రూ.6,500 కు మించి చెల్లింపులు చేస్తున్నవారు రూ.15 వేలకు మించి కూడా చెల్లింపులు చేయాలంటే కొత్తగా ఆప్షన్ ఇవ్వాలని, రూ.15 వేలకు మించిన మొత్తానికి కార్మికులు అదనంగా 1.16 శాతం చెల్లించాలన్న కొత్తగా చేర్చిన నిబంధన చెల్లదని చెప్పింది. ఈ తీర్పు లక్షలాది కార్మికులకు ఊరట ఇస్తుంది.

కేంద్ర బీజేపీ ప్రభుత్వం దీనితో ఊరుకుంటుందని, హైకోర్టు తీర్పును అమలు చేస్తుందని చెప్పలేం. అంతకు ముందు కూడా కేరళ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసి చేయి కాల్చుకుంది. 1995 పెన్షన్ స్కీం ప్రకారం సీలింగ్ వేతనం వరకే పెన్షన్ చెల్లిస్తారు. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం 1995 ప్రకారం సీలింగ్ వేతనం వరకు యజమాని వాటాగా కట్టిన పీఎఫ్ నుండి 8.33 శాతాన్ని పెన్షన్ ఫండ్‌కు జమచేయాలి. పెన్షనబుల్ వేతనం కూడా ఆ సీలింగు వేతనం ఆధారంగానే లెక్కేశారు. ఆ తరువాత 1996లో సీలింగుకు మించి చెల్లించిన వారు ఉభయుల ఆప్షన్ లెటర్ ఇస్తే సీలింగుకు మించిన వేతనం పైన కట్టిన పీఎఫ్ నుండి కూడా 8.33 శాతం పెన్షన్ ఫండ్‌కు జమ అవుతుంది. ఆ అధిక వేతనం ఆధారంగానే పెన్షనబుల్ వేతనం నిర్ణయించబడుతుందని చేర్చారు. దీన్ని చూసుకోలేదని కొంత మంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు కోర్టుకు వెళ్లి వాస్తవ వేతనం (అధిక) మీద చెల్లింపుల ఆధారంగా తమకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కేసు కూడా కేరళ హైకోర్టు ద్వారా సుప్రీంకోర్టు వరకు వెళ్లింది.

2016 అక్టోబరు 4న సుప్రీంకోర్టు మంచి తీర్పు ఇచ్చింది. ఆప్షన్లు ఇవ్వని పని చేస్తున్న ఉద్యోగులకు ఉభయుల ఆప్షన్లు తీసుకుని సీలింగుకు మించి యజమాని కట్టిన వాటా నుండి కూడా 8.33 శాతం పెన్షన్ నిధికి జమ చేయాలన్నది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సీలింగుకు మించి యజమాని కట్టిన పీఎఫ్ మొత్తాన్ని కూడా తీసుకున్నారు. దానిలో 8.33 శాతాన్ని వడ్డీతో సహా తిరిగి పెన్షన్ ఫండ్‌కు కడితే అధిక (హైయర్) పెన్షన్ ఇచ్చి తీరాలని తీర్పు చెప్పింది. ఉభయుల అంగీకార పత్రం కూడా తీసుకోవాలి.

దీనిని అమలు చేయకుండా కేంద్ర బీజేపీ ప్రభుతం అనేకకనేక ఆంక్షలు పెట్టింది. మినహాయింపులు పొందని (నాన్ ఎగ్జెంప్టెడ్) సంస్థల ఉద్యోగులకే ఇది వర్తిసుందని, మినహాయింపులు పొందిన (సొంత పీఎఫ్ ట్రస్టులు ఉన్నవి) సంస్థల ఉద్యోగులకు ఇది వర్తించదని కిరికిరి పెట్టింది. మినహాయింపులు పొందని సంస్థల ఉద్యోగులే సుప్రీంకోర్టులో కేసు వేశారని, సొంత పీఎఫ్ ట్రస్టులు సీలింగుకు మించిన వేతనం నుండి 8.33 శాతం పెన్షన్ ఫండ్‌కు జమ చేయకుండా ట్రస్టు వద్దే ఉంచుకున్నాయని వాదించింది. 2018 అక్టోబరు 12న కేరళ హైకోర్టు మినహాయింపులు పొందని - మినహాయింపులు పొందిన సంస్థల ఉద్యోగుల మధ్య వివక్ష చూపించ కూడదని చెప్పింది. 31.03.2017 న ఈపీఎఫ్ఓ ఇచ్చిన ఈ ఆదేశాన్ని కొట్టివేసింది.

దేశంలో కోట్లాది మంది కార్మికులకు తాజా సీలింగ్ వేతనాన్ని (15 వేలు) కూడా చేరుకోగలిగే పరిస్థితి లేదు. వారికి కనీస పెన్షన్ పెంచాలనే డిమాండు, దానిపై పోరాటాలు కొనసాగుతున్నాయి. మానవత్వం లేని బీజేపీ ప్రభుత్వానికి కనీస పెన్షన్ పెంచాలనే ఆలోచన లేదు. ఈపీఎస్ పెన్షనర్లకు డిఏ ఇవ్వాలని కోరిక కూడా ఎప్పటి నుండో ఉంది. బీజేపీ ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేస్తున్నది.

జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. 30, 40 సంవత్సరాల పాటు సమాజానికి సేవలు చేసిన కార్మికులకు పదవీ విరమణ తరువాత జీవనానికి సరిపడా పెన్షన్ ఇవ్వటానికి కేంద్ర ప్రభుత్వానికి మనసు ఒప్పటం లేదు. మరో పక్క కార్పొరేట్ కంపెనీలకు రూ.5 లక్షల కోట్లు పైగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రాయితీలిస్తోంది. ప్రభుత్వం చేసే చట్టాలు రాజ్యాంగానికి అనుగుణంగా ఉండాలి. కానీ ఈపీఎఫ్, ఈపీఎస్ చట్టాలు అలాలేవు. వాటిని కొట్టేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది.

కోట్లాది మంది శ్రమజీవుల ఓట్లతో అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోటం లేదు. బీజేపీ ప్రభుత్వం మైనార్టీలపైన, పొరుగున ఉన్న పాకిస్తాన్, చైనాలపైన విద్వేషాన్ని రెచ్చగొట్టి మనగలుగుతోంది. 4 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులు, ఈపీఎస్ పెన్షనర్లు వాస్తవాలు తెలుసుకుని కన్నెర్ర జేస్తే ప్రభుత్వాలు పతనంగావూ!?

శబరిమల - వాస్తవాలు

- ఎంవీఎస్ శర్మ

'శబరిమల దేవాలయంలోకి మహిళలు పోవచ్చా, లేదా అన్నది నిర్ణయించడానికి కోర్టులకు అధికారం లేదు. అయ్యప్ప స్వామి బ్రహ్మచారి. ఆ ఆలయంలోకి సంతానవతులు కాగలిగిన మహిళలు రాకూడదన్నది అయ్యప్ప స్వామి నిర్ణయం. దానిని ఉల్లంఘించడం అంటే అది హిందూ మతం మీద దాడి'. స్థూలంగా శబరిమల వివాదంలో సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్న వారి వాదన ఇదే. 'వెయ్యి సంవత్సరాలకు పైబడి కొనసాగుతున్న ఆచారాలను,



కట్టుబాట్లను ఎలా ఉల్లంఘిస్తారు?' అని వారు అడుగుతున్నారు. వాస్తవాలు చూస్తే ఈ వాదనకు ఎటువంటి ఆధారమూ, ప్రాతిపదికాలేదు.

1991 వరకూ శబరిమలలోని అయ్యప్ప గుడికి అన్ని వయసుల మహిళలూ వెళ్తుండేవారు. తిరువాన్కూర్ సంస్థానం పెత్తనంలో ఈ దేవాలయం ఉండేది. తిరువాన్కూర్ మహారాణి, ఆమె కుటుంబంలోని స్త్రీలు, పెత్తం దారీ కులాల్లో ఒకటైన నాయర్ల కుటుం బాల్లోని స్త్రీలు ఆ దేవాలయానికి పోతుండే వారు. బారసాల, అన్నప్రాసన వంటి తంతులు ఆ గుడిలో కుటుంబ సమేతంగా జరుపుకునేవారు. అయ్యప్ప గుడివద్ద సినిమా షూటింగులు సైతం జరిగేవి. ఆ దేవాలయ పూజారి ప్రతి షూటింగ్‌కు రూ.7,500 ఫీజు వసూలు చేసేవారు. ఆ గుడి మెట్ల మీద (ఆ 18 మెట్లూ చాలా పవిత్రమైనవి అన్న ప్రచారం ఇప్పుడు ఉంది) సినిమా నటుల, నటీమణుల నృత్యాలను చిత్రీకరించేవారు. ఆ నటీమణుల్లో కొందరు అయ్యప్పను దర్శించుకునేవారు కూడా. ఈ విషయాలు వాస్తవమో కాదో తేల్చుకోవడానికి పెద్ద కష్టపడనక్కర్లేదు.

1991లో కొందరు భక్తులు హైకోర్టులో కేసు వేశారు. అయ్యప్ప స్వామి బ్రహ్మచారి గనుక స్త్రీలను ఆ దేవాలయంలోకి అనుమతించడం మంచిది కాదని, అయితే స్త్రీలు (అన్ని వయసుల వారూ) దేవాలయంలోకి ప్రవేశిస్తున్నారని దీనిని నిరోధిస్తూ కోర్టు ఆదేశించాలని ఆ భక్తులు కోరారు. ఆ సందర్భంగానే అయ్యప్పను సందర్శించిన స్త్రీల గురించి కోర్టుకు దాఖలు చేసిన అఫిడవిట్‌లో పై విధంగా పేర్కొన్నారు. హైకోర్టుకు అయ్యప్ప భక్తులు సమర్పించిన ఆ అఫిడవిటే మనకు దాఖలా. దాని ప్రకారమే 1991 వరకు అయ్యప్ప సన్నిధికి అన్ని వయసుల మహిళలూ వెళ్లి వస్తుండేవారని నిర్ధారణ అయింది.

దీన్ని బట్టి కొన్ని నిర్ధారణలకు రావచ్చు

1. అయ్యప్పస్వామి తన వద్దకు మహిళలు (పది సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు) రాకూడదని ఆదేశించినట్టు విశ్వసించడానికి ఆస్కారం లేదు. వెయ్యి సంవత్సరాలకు పైబడి ఆ గుడి ఉండి వుండవచ్చు. కానీ ఇటీవల వరకు (1991 వరకు) అన్ని వయస్సుల మహిళలూ దర్శనానికి పోతూ ఉండేవారు అన్నది హైకోర్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

2. 'కోర్టులకేమి అధికారం ఉంది? ఇది విశ్వాసానికి సంబంధించిన విషయం' అన్న వాదనలో అర్థం లేదు. ఎందుకంటే మహిళలను నిరోధించమని హైకోర్టుకు పోయింది 'విశ్వాసం' ఉన్న భక్తులే. కోర్టు తనంతట తాను జోక్యం చేసుకున్నది కాదు. పది సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వయస్కులు అన్న కొలబద్ద కూడా ఈ సందర్భంగా ఉనికిలోకి వచ్చింది.

ఇప్పుడు సుప్రీంకోర్టు తాజా తీర్పుకు వద్దాం. 2018లో ఇటీవల ఇచ్చిన ఈ తీర్పునకు ముందు కేసు 11 సంవత్సరాలు నడిచింది. 2007లో ముగ్గురు మహిళలు (శ్రీమతి ప్రేమకుమారి, మరి ఇద్దరు) సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 1991లో హైకోర్టు తీర్పు మహిళల పట్ల వివక్ష చూపుతోందని, అందు వలన ఇది రాజ్యాంగం గ్యారంటీ చేసిన 'సమానత్వం' సూత్రానికి విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. సుప్రీం కోర్టుకు వెళ్లిన ఈ ముగ్గురు పిటిషనర్లూ బీజేపీ వారే. ఆనాటి కేరళ ఆరెస్సెస్ నాయకులు ఈ పిటిషన్‌ను సంపూర్ణంగా సమర్థించారు. ఆనాడు కేరళలో ఉన్నది ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశం మీద తన వైఖరిని తెలియజేయాలని సుప్రీంకోర్టు కోరిన మేరకు ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం మహిళలను దర్శనానికి అనుమతించడమే సరైనదని తన అభిప్రాయాన్ని విన్నవించింది.

అంటే 2007లో బీజేపీ, ఆరెస్సెస్ ఏ వైఖరిని తీసుకున్నాయో ఎల్‌డీఎఫ్ కూడా ఆ వైఖరినే తీసుకుంది.

ఆ తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలో యూడీఎఫ్ అధికారంలోకి వచ్చినప్పుడు ఎల్‌డీఎఫ్ వైఖరిని తిరస్కరించి, మహిళల దర్శనంపై ఆంక్షలు కొనసాగడమే సరైనదని తమ ప్రభుత్వం భావిస్తునట్టు కొత్త అఫిడవిట్ దాఖలు చేసింది.

2017లో మళ్లీ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వచ్చింది. తొలి దినాల్లో ఈ కేసుపై దృష్టి పెట్టడం కుదరలేదు. యూడీఎఫ్ ప్రభుత్వ కాలంలో తీసుకున్న వైఖరినే కేరళ ప్రభుత్వం తరపున నియమించిన లాయరు ఇప్పుడు కూడా కోర్టులో పునరుద్ఘాటించారు! దాంతో కేరళలో పలువురు సీపీఎంనీ, ఎల్‌డీ ఎఫ్‌నీ

తప్పుబట్టారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఆ లాయరును తొలగించి వేరొ కరిని ఆ స్థానంలో నియమించింది. 2007లో ఎల్‌డీఎఫ్ తీసుకున్న వైఖరినే తిరిగి సుప్రీం కోర్టులో వినిపించింది.

చివరికి సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. 1991లో హైకోర్టు విధించిన నిషేధం చెల్లదని తేల్చి చెప్పింది. మత విశ్వాసాలు వ్యక్తుల వ్యక్తిగతమైనవని, ఆ విశ్వాసాలను పాటించే క్రమంలో లింగ వివక్ష చూపితే అది రాజ్యాంగం గ్యారంటీ చేసిన 'సమానత్వం' హక్కుకు భంగకరం అవుతుందని, అందువల్ల వివక్షత చెల్లదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

ఈ తీర్పును బీజేపీ, కాంగ్రెస్ స్వాగతించాయి. అభ్యుదయ వాదులంతా హర్షించారు. కానీ రెండు రోజుల్లోనే బీజేపీ వైఖరి మార్చుకుంది. ఆ వెంటనే కాంగ్రెస్ కూడా అదే బాట పట్టింది.

బీజేపీ 2007లో సుప్రీంకోర్టుకు పోయిందీ, మహిళలను అనుమతించాలని వాదించిందీ వారే, తీర్పును స్వాగతించిందీ బీజేపీ వారే. హఠాత్తుగా ఫిరాయించి తీర్పును ప్రశ్నిస్తున్నదీ వారే.

దీన్నిబట్టి ఒకటి స్పష్టం అవుతోంది. ఇది భక్తుల విశ్వాసాలకు సంబంధించిన విషయమూ కాదు. శతాబ్దాల నుండి కొనసాగే సంప్రదాయమూ కాదు. ఇదంతా సంఘపరివార్ కుటిల రాజకీయం. వాళ్లకి కావాల్సింది భక్తుల విశ్వాసాలు కానేకావు. ఆ విశ్వాసాలే సరైనవని అనుకుంటే 2007లో సుప్రీంకోర్టుకు ఎందుకెళ్లారు? ఈ 11 సంవత్సరాలలో ఏనాడూ సుప్రీంలో తమ పార్టీ తరపున వాదనని ఎందుకు వినిపించలేదు? 2014లో కేంద్రంలో తమ ప్రభుత్వం వచ్చాక కూడా ఎందుకు జోక్యం చేసుకోలేదు? సుప్రీం తీర్పును ఎందుకు తొలుత స్వాగతించారు? ఈనాడు గగ్గోలు పెడుతూ ఎల్డీఎఫ్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తూ నానా యాగీ చేస్తున్నవారు కేంద్రం తరపున రివ్యూ పిటిషన్ ఎందుకు వేయలేదు? 27-10-18న అమిత్ షా అసలు సంగతి బైటకి కక్కారు. 'మేం రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని వినియో గించి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేస్తాం' అని బెదిరించారు.

దేశంలో ప్రజల ముందు ఒక ప్రత్యామ్నాయంగా, ఆదర్శవంతంగా నడుస్తున్న ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ మనుగడని ఆరెస్సెస్/బీజేపీ సహించలేక పోతున్నాయి. వందల

కొద్దీ ఎల్‌డీఎఫ్ కార్యకర్తలను హతమార్చాయి. కనీవినీ ఎరుగనంత తీవ్రమైన నష్టం ఇటీవల వరదల్లో సంభవిస్తే సాయం చేయడం మాట అటుంచి, వచ్చే సహాయాన్ని సైతం రానివ్వకుండా అడ్డుకుంది. ఇదీ సంఘీయుల మానవత్వం! అయినా పినరయి విజయన్ ప్రభుత్వం అమోఘమైన తీరులో ప్రజలను ఆదు కునే కార్యక్రమాలు చేపట్టింది. ఆ కృషిని దేశమంతా శ్లాఘించింది (బీజేపీ, ఆరెస్సెస్ తప్ప).

పినరయి విజయన్ ప్రభుత్వం కనీస వేతనం రూ.18 వేలు అమలు చేస్తోంది. పెట్రో ధరలు భగ్గుమంటూ ఉంటే తన వంతు బాధ్యతగా ధరలు తగ్గించింది. బడుగు, బలహీన వర్గాల నుండి సైతం పూజారులుగా శిక్షణ ఇచ్చి, వారిని ఆలయాల్లో నియమించి సామాజిక న్యాయంలో ముందడుగు వేసింది. ఇవేమీ ఆరెస్సెస్/బీజేపీకి మింగుడు పడడం లేదు. అందుకే ఈ కచ్చు!

ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాలను గౌరవించింది. కానీ ఆరెస్సెస్, బీజేపీ ప్రజల విశ్వాసాలను తప్పుదోవ పట్టించి, విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. వారి వక్రీకరణలకు, అబద్ధాలకు హద్దే లేకుండా పోతోంది. ఇక కాంగ్రెస్ పార్టీ కేరళలో అనుసరించిన అవకాశవాద వైఖరి గురించి, బీజేపీకి తోకగా వ్యవహరిస్తున్న దిగజారుడు గురించి ఎంత చెప్పినా తక్కువే.

కేరళ ప్రజలు విజ్ఞులు. కనుకనే అక్కడ ఎల్‌డీఎఫ్ సూత్రబద్ధ వైఖరిని అత్యధికులు స్వాగతిస్తున్నారు. నిన్నటిదాకా ఎల్‌డీఎఫ్‌ని వ్యతిరేకించి బీజేపీ వైపు మొగ్గుచూపిన శ్రీనారాయణ గురు ధర్మ పాద యోగం ఈ రోజు ఎల్‌డీఎఫ్ వైఖరిని సమర్థిస్తోంది. అంతేగాక బీజేపీ మీద కోర్టు ధిక్కరణ కేసు వేయడానికి తయారవుతోంది. అచ్యుతానందన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలం నుండీ ఎల్‌డీఎఫ్‌ను వ్యతి రేకించిన గిరిజన నాయకురాలు సీకే జాను ఆ క్రమంలో బీజేపీకి దగ్గరైంది. శబరిమల వివాదం అనంతరం ఆమె బహిరంగంగా బీజేపీ వైఖరిని ఖండిస్తున్నారు. అంతేగాక, అయ్యప్ప తరతరాలుగా తమ గిరిజనుల దేవత అని, కుట్రతో అగ్రవర్ణ హిందూ గ్రూపులు ఆ ఆలయాన్ని తమ పెత్తనంలోకి తీసుకున్నారని వాదిస్తున్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటూ వచ్చిన పలు దళిత సంఘాలు ఇప్పుడు ఆ పార్టీ వైఖరిని ఈసడించుకుని ఎల్‌డిఎఫ్‌ను సమర్థిస్తున్నాయి.

చివరగా ఒక విషయం. సుప్రీం కోర్టులో అయిదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో నలుగురు ఇచ్చిన తీర్పుతో విభేదిస్తూ జస్టిస్ ఇందు మల్హోత్రా చేసిన వ్యాఖ్యలు కూడా కొట్టి పారేయాల్సినవి కావు. 'మత విశ్వాసాలకు సంబంధించిన వివాదాలను కోర్టుల్లో తేల్చుకోవాలను కోవడం సరైనది కాదు' అని ఆమె వ్యాఖ్యా నించారు.

ప్రపంచంలో అన్ని మతాలలోనూ అనేక విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలు ఉంటాయి. వీటన్నింటినీ

(తరువాయి 17వ పేజీలో)

పురుషాహంకారంపై తిరుగుబాటు 'మీ టూ' ఉద్యమం

'నేను సైతం' (మీ టూ) ఉద్యమం భారత్‌లో కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ ఉద్యమ ఉధృతికి కూలిపోయాడు. అనేక మంది సెలబ్రిటీలు, ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు 'మీ టూ' ఉద్యమం పేరు వింటేనే హడలిపోతున్నారు.

సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా)ను వేదికగా చేసుకుని మహిళలు ఎక్కుపెట్టిన 'మీ టూ' బాణాల తాకిడికి కామపిశాచుల ముసుగు తొలగిపోయి అసలు రూపాలు బయటపడుతున్నాయి.

'మీ టూ' ధాటికి కేంద్రమంత్రి, మత గురువులు, క్రీడా ప్రముఖులు, సినీ ప్రముఖులు, ఉన్నతాధికారులు, వైద్యులు, పాత్రికేయులు ఒకరనేమిటి మహిళలను లైంగికంగా వేధించిన ఒక్కొక్కరి అసలు రంగు బయట పడుతోంది.

గత ఏడాది అక్టోబర్ నెలలో లైంగిక వేధింపులపై హాలీవుడ్ నటి అలీసా మిలానో తనకు ఎదురైన లైంగిక వేధింపులపై 'మీ టూ' (నేను సైతం) హ్యాష్‌ట్యాగ్‌తో ట్విట్టర్‌లో ఒక పోస్టు పెట్టింది. ఒక్క రోజులోనే రెండులక్షల మంది తమ అనుభవాలను వివరిస్తూ మద్దతు పలికారు. ఫేస్‌బుక్‌లో 47 లక్షల మంది యూజర్లు తమకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి 1.20 కోట్ల పోస్టులు పెట్టారు. ఇందులో తొలి ఇరవై గంటల్లో 45 శాతం పోస్టులు ఒక్క అమెరికా నుంచే వచ్చాయి. అమెరికాలో ఉన్నది బూటకపు ప్రజాస్వామ్యమనడానికి ఇదో ఉదాహరణ.

మీ టూ... ఉద్యమం ప్రస్తుతం భారతీయ మహిళలు రాస్తున్న కొత్త చరిత్ర. "చెప్పుకునే ఆడపిల్లలకు వినగలిగే సమాజం ఉంటే ఉద్యమ స్వరం మీటినట్టే" అన్న ఓ పాత్రికేయుడి ఫీల్‌కు నిలువెత్తు నిదర్శనం 'మీ టూ' ఉద్యమం. 'పురుషాహంకారంపై మీ టూ ఉద్యమం ఓ అంకుశం. ఇది మరింత పదునెక్కాలి. పురుషాధిక్య సమాజాన్ని చీల్చిచెండాడాలని ప్రజాస్వామ్య వాదులు బలంగా భావిస్తున్నారు.

పాత్రికేయుడిగా సంపాదకుడుగా గతంలో పనిచేసిన కేంద్ర మంత్రి ఎంజె అక్బర్‌పై ఏకంగా 15 మంది మహిళా జర్నలిస్టులు తమపట్ల అక్బర్ ఎంత అసభ్యంగా ప్రవర్తించేవారో వివరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది.

తన సహచర మంత్రిపై తీవ్రమైన ఆరోపణలు వస్తుంటే ప్రధాని మోడీ నిమ్మకు నీరెత్తినట్టు నోరు మెదపకుండా కూర్చున్నారు. గతంలో కాంగ్రెస్‌లో చురుగ్గా ఉన్న ఎంజె అక్బర్ 2010 నుంచి మోడీతో స్నేహం కలిపారు. తన అవసరాలకు తగినట్టుగా వ్యవహరించే అక్బర్ పట్ల ప్రధానికి అమిత మోజు.

కేంద్రంలోని మహిళా మంత్రులు సుష్మా స్వరాజ్, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ లాంటి వాళ్లు కనీసం స్పందించక పోవటం భారతీయ మహిళల పట్ల వీరికున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. మరో కేంద్రమంత్రి మేనకా గాంధీ ఆరోపణలు వచ్చిన వారిపై విచారణ జరపాల్సిందేనని, తాను వ్యక్తిగతంగా మీటూ ఉద్యమాన్ని బలపరుస్తున్నానని ప్రకటించారు. పెరుగుతున్న వత్తిడి తట్టుకోలేక ఎంజె అక్బర్ చివరకు రాజీనామా చేయాల్సి వచ్చింది. సంచలనాల తెహల్కా. కామ్ మేగజైన్ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌పై కోర్టులో లైంగిక వేధింపుల కేసు నడుస్తోంది.

పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సైతం మినహాయింపు కాదని తేలింది. ఇందిర అనే న్యాయవాది సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఏకే గంగూలీ తనపట్ల

అసభ్యంగా ప్రవర్తించారన్న ఫిర్యాదుపై ఏర్పాటయిన కమిటీ గంగూలీని దోషిగా తేల్చింది. ఈ సందర్భంగానే పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టడానికి ఉద్దేశించిన చట్టం అమల్లోకి వచ్చింది. 1988లో పంజాబ్ కేడర్ రూపన్ అనే ఐఏఎస్ మహిళాధికారిణి పంజాబ్ ఐజీ కేపీఎస్ గిల్‌పై కేసు నమోదు చేసింది. 2006లో ఉమ్మడి ఏపీలో మంగపతిరావు అనే ఐఏఎస్ అధికారి తన కింది అధికారిణిని వేధించినట్టు కేసు నమోదైంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలు పెట్టి ఈ దేశంలో సినీ నటుని స్థాయి వరకూ మహిళల్ని లైంగికంగా వేధించటంలో, పని ప్రదేశాల్లో ఇబ్బంది పెట్టడంలో తేడా లేని

విధంగా వ్యవహరిస్తున్నారు.

అమెరికా అయినా అమలాపురమైనా పురుషాధిక్య సమాజంలో మహిళ ఎంతటి క్షోభకు గురవుతున్నదో 'మీ టూ' ఉద్యమంలో వస్తున్న కథనాలే సజీవ సాక్ష్యాలు, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ మహిళలతో ఎంత అసభ్యంగా ప్రవర్తించాడనే దానిపైనే పెద్దఎత్తున చర్చ నడిచింది. ఒక దశలో ట్రంప్ బహిరంగంగా మహిళలకు క్షమాపణలు చెప్పాల్సివచ్చింది.

ఇండియన్ టైమ్స్ హైదరాబాద్ ఎడిషన్ రెసిడెంట్ ఎడిటర్ కె.ఆర్.శ్రీనివాస్‌పై ఏడుగురు మహిళా పాత్రికేయులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో యాజమాన్యం ఆయనను బయటకు పంపింది.

ప్రముఖ రచయిత చేతన్ భగత్ ఏడాది క్రితం ఓ మహిళకు పంపిన సందేశాలు ఇప్పుడు ఆయనను వివాదంలోకి లాగాయి. క్రికెట్ మాజీ కెప్టెన్, ప్రస్తుతం శ్రీలంకలో మంత్రిగా ఉన్న అర్జున్ రణతుంగపై ఓ ఎయిర్ హోస్టెస్ ఆరోపణలు చేశారు. మంత్రి హోదాలో ఉన్న రణతుంగ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె చెప్పారు.

'క్వీన్' దర్శకుడు తనను లైంగికంగా వేధించాడని సినీ నటి కంగనా రనౌత్ ఆరోపణలు చేసింది. బాలీవుడ్ సీనియర్ నటుడు అలోక్‌నాథ్ తనపై అత్యాచారం చేశాడంటూ రచయిత్రి వింటానందా పేర్కొన్నారు. బాలీవుడ్ దర్శకురాలు నమితా ప్రకాష్ ఓ నటుడి తండ్రి తనపై అత్యాచార యత్నం చేసినట్టు వెల్లడించారు.

లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో బాలీవుడ్ దర్శకులు సాజిద్‌ఖాన్, వికాస్ బాల్, సుభాష్ కపూర్, నటుడు నానాపటేకర్, ఆశిష్ పాటిల్, అనిర్బావ్ దాస్‌బ్లాహ్, మలయాళ నటుడు దిలీప్, 'దేదే ప్యార్‌దే' సినిమా దర్శకుడు లవ్ రంజన్‌లు ఉన్నారు.

తెలుగు సినీ ప్రపంచంలో క్యాస్ట్ క్యాచింగ్ పేరుతో జరుగుతున్న దారుణాలను నటి శ్రీరెడ్డి, మరి కొందరు జూనియర్ ఆర్టిస్టులు సమాజానికి వెల్లడి చేసిన విషయం విదితమే. తాజాగా సినీ నటుడు అర్జున్‌పై సహనటి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

ఆఖరుకు కొందరు మహిళా ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు కూడా తాము ఎలా వేధింపులకు గురయ్యామో వివరించారు. సినీ రంగమైనా, పాత్రికేయ వృత్తిలోనైనా, రాజకీయ రంగంలోనైనా, ఉన్నతాధికార్లయినా వేధింపులకు మినహాయింపు కారని తేలిపోయింది. పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కొరకు పలు చట్టాలు ఉన్నా రక్షణకు తోడ్పడటం లేదు. ఈ నేపథ్యంలో మహిళలు పూరించిన "మీ టూ" శంఖారావం ఆహ్వానించతగ్గ పరిణామం. ఎప్పుడో జరిగిన ఘటనలను ఇప్పుడు మాట్లాడటమేమిటి అని కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. "గోముఖ వ్యాఘ్రాల" అసలు రూపం తెలియటానికి, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఈ ఉద్యమం పురుష దురహంకారానికి చెంపపెట్టు. ఈ ఉద్యమాన్ని ప్రజాస్వామ్య వాదులు ప్రత్యక్ష మద్దతు ప్రకటించి బలపరచాలి.

- కందారపు మురళి, తిరుపతి

(15వ పేజీ తరువాయి)

రూపొందించింది ఆయా కాలాల్లోని మతాధిపతులే. కాలం మారుతున్న కొద్దీ, శాస్త్రీయ అవగాహన విస్తరిస్తున్న కొద్దీ ఆ ఆచారాలు, సంప్రదాయాలు అనాగరికంగా, అర్థరహితంగా తయారవుతాయి. కాలానుగుణంగా వాటిని మార్చుకోవడం అవసరం. లేకపోతే ఆ మతాల్లో సైతం తిరుగుబాట్లు వస్తాయి. యూరప్‌లో వచ్చిన ప్రొటెస్టాంటిజమ్ అటువంటిదే.

మన దేశంలోనూ బౌద్ధం, జైనం వేల సంవత్సరాల క్రితమే బ్రాహ్మణ మతాన్ని, వర్ణ వ్యవస్థని, మనుధర్మ శాస్త్ర నిబంధనలని సవాలు చేశాయి. హిందూ మతంలో సైతం వివిధ కాలాల్లో పలు ఉద్యమాలు తలెత్తి సంస్కరణలకు దారితీశాయి. క్రీ.శ. 12-16 శతాబ్దాల మధ్య భక్తి ఉద్యమం బలంగా వ్యాపించి కుల వ్యవస్థను సవాలు చేసింది. దురాచారాలను ప్రశ్నించింది. సూఫీ ఉద్యమం, మీరాబాయి, చైతన్యుడు, మన ప్రాంతంలో వేమన, మొల్ల వీరంతా సంప్రదాయాలను, విశ్వాసాలను ప్రశ్నించిన వారే. ఆ ప్రభావంతో ఎప్పటికప్పుడు ఎంతో కొంత మూఢత్వాన్ని అనాగరికతను వదుల్చుకుంటూ వచ్చాయి మతాలు. ఈ తిరుగుబాట్లు, సంస్కరణలు నిరంతరం సాగే ప్రక్రియలో భాగమే.

రాజారామమోహన్‌రాయ్, విద్యాసాగర్, ఆర్య సమాజం, రామకృష్ణ మిషన్, మన గడ్డపై కందుకూరి, గురజాడ, దక్షిణాదిన పెరియార్, నారాయణ గురు- వీరంతా దురాచారాలపై, ఆధిపత్య భావజాలంపై పోరాడిన వారే. వీరందరూ సాగించిన ఉద్యమాలు సమాజాన్ని మతాలను సంస్కరించగలిగాయి. బాల్య వివాహాల రద్దు, బహు భార్యత్వ నిషేధం, సతి రద్దు, వితంతు వివాహాలకు ఆమోదం వంటివి ఆ క్రమంలోనే సాధ్యమయ్యాయి. ఆయా కాలాల్లో ఈ సంస్కరణల కోసం ఆ మహనీయులు పూనుకున్నప్పుడు కూడా సాంప్రదాయాలు నాశనమై పోతున్నాయని, హిందూమతం నాశనమై పోతున్నదని, గగ్గోలు పెట్టారు. ప్రతిఘటించారు. అలా ప్రతిఘటించిన వారంతా బలహీనపడ్డారు. ప్రజలు సంస్కరణలను స్వాగతించారు. ఇది రానున్న కాలంలోనూ జరగవలసిన, జరుగుతున్న ప్రక్రియ.

సమాజం అంతిమంగా ఎప్పుడూ ముందుకే పోతుంది. వెనక్కి లాగాలని ప్రయత్నించే వారు, పురోగమనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసే వారు కాల గర్భంలో కలిసిపోతారు. కేరళలో కూడా జరుగు తున్నదీ. జరగబోయేదీ అదే.

మధ్యపేజీ కథనం

కనీస వేతనాల ముసాయిదా జీఓల మతలబు ఏమిటి?

పి.అజయకుమార్

రాష్ట్ర పరిధిలోని షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాలకోసారి వేతన సవరణ చేయాలి. కనీస వేతనాల చట్టం కింద షెడ్యూల్స్ ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో రెండు షెడ్యూల్స్ ఉన్నాయి. షెడ్యూల్ అంటే పట్టిక. వ్యవసాయేతర షెడ్యూల్లో 65 ఎంప్లాయ్ మెంట్స్, వ్యవసాయ సంబంధ షెడ్యూల్లో 8 ఎంప్లాయ్‌మెంట్స్ ఉన్నాయి. ఎంప్లాయ్ మెంట్స్ అంటే తెలుగులో పనులు లేదా ఉపాధి లేదా ఉద్యోగాలు అని చెప్పుకోవచ్చు. ప్రస్తుత అంశానికి సంబంధించి పనులు అనటం సబబుగా ఉంటుంది. పని ఎక్కడ అన్నపుడు వ్యవసాయేతర షెడ్యూల్లో హోటల్స్, పెట్రోలు బంకులు, బీడీ, పరిశ్రమలు మొదలగు 65, వ్యవసాయ సంబంధ షెడ్యూల్లో వ్యవసాయం, కోళ్ల ఫారాలు, డెయిరీ ఫారాలు తదితరం 8 ఉన్నాయి. మొత్తం 73 ఎంప్లాయ్ మెంట్స్‌లోనూ నేరుగా వ్యవసాయ పని మినహా మిగతా వాటన్నిటిలోనూ 50 లక్షల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు.

5 సంవత్సరాలకోసారి వేతన సవరణ చేయాలని కనీస వేతనాల చట్టం నిర్దేశిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ నిర్దేశాన్ని పాటించిన పాపాన పోలేదు. ఇపుడు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి 4 సంవత్సరాలు దాటింది. అది అధికారంలోకి వచ్చిన సమయానికే 50 ఎంప్లాయ్‌మెంట్స్‌కు పైగా వేతన సవరణ గడువు మీరింది. అయినా దానిలో చలనం లేదు. పెట్టుబడిదారులకు తివాచీలు పరచడమే దానికి సరిపోయింది. కార్మిక సంఘాలు పోరాడిన మీదట, 2018 నాటికల్లా అన్నిటికీ వేతన సవరణ గడువు మీరిన తరువాత అది మేల్కొని హడావుడిగా మొత్తం 73 ఎంప్లాయ్‌మెంట్స్‌కు వేతనాలు సవరిస్తూ ప్రతిపాదనలు చేసింది. 55 ఎంప్లాయ్‌మెంట్స్‌కు ఎటువంటి వేతన పెరుగుదల లేకుండా ప్రతిపాదనలు చేసింది. మరో 12 ఎంప్లాయ్‌మెంట్స్‌కు వేతనాలను తగ్గించింది. కొద్ది ఎంప్లాయ్ మెంట్స్‌కు కొసరు వేసింది. మన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించే వేతనాలు చాలా తక్కువ. తాజా వీడీఏతో కలుపుకున్నా అవి కనీస స్థాయిలో నెలకు 5 వేల నుండి 7, 8 వేల రూపాయల వరకే ఉన్నాయి. కొద్ది వాటిలో మాత్రం 9, 10 వేల రూపాయల

వరకు ఉన్నాయి. యూనియన్లు బలంగా ఉన్న చోట తప్పిస్తే అవి కూడా సాధారణంగానే అమలుకు నోచుకోవు.

కనీస వేతనాల చట్టం ప్రకారం మొత్తం ఎంప్లాయ్‌మెంట్స్‌ను (యూనియన్లు, యజమానులు, ప్రభుత్వప్రతినిధులతో కూడిన) గ్రూపులుగా విభజించి కమిటీలు వేసి వాటి సలహా తీసుకుని లేదా తనంతట తానుగా గానీ వేతన సవరణను ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ముసాయిదా జీఓలు ఇవ్వొచ్చు. వాటిని గెజిట్ చేసిన తేదీ నుండి 2 నెలలలోగా అభ్యంతరాలను, సూచనలను తీసుకొని 3 నెలల తరువాత వాటిని ఫైనలైజ్ చేయాలి. కనీస వేతన సవరణను ప్రతిపాదించేప్పుడు యూనియన్లు, యజమానులు, ప్రభుత్వ ప్రతినిధులతో కూడిన కనీస వేతనాల బోర్డును సెక్షన్ 5లోని సబ్ సెక్షన్ 2 కింద ఉన్న ప్రొవిజన్ ప్రకారం సంప్రదించాలి. రాష్ట్ర ప్రభుత్వం 11 సంవత్సరాల తరువాత కనీస వేతనాల సలహా బోర్డును వేసింది. దానిలో సిఐటీయుకు ప్రాతినిధ్యం ఇవ్వలేదు. తెలుగుదేశం ప్రభుత్వానికి సిఐటీయు ప్రమాదకారిగా కనిపించడం సహజమే మరి!.

లేబరు డిపార్ట్‌మెంట్ ముసాయిదా జీఓలు విడుదల చేయకముందే కనీస వేతనాల సలహా బోర్డు ఉంది. దానిని సంప్రదించకుండానే ముసాయిదా జీఓలు విడుదలయ్యాయి. అయినా బోర్డులో చలనం లేక పోవటం ఒక అంశం అయితే అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించిన మీదట కనీస సలహా బోర్డు ముందు పెడతామని లేబర్ డిపార్ట్‌మెంట్ చెప్పటం అది యజమానులకు అమ్ముడుపోయిన తీరును తెలియజేస్తోంది. కనీస వేతనాల సలహా బోర్డుకు కనీస విలువ లేకుండా చేసిన ప్రభుత్వ అహంకారం కార్మికుల ముందు సోదాహరణగా బట్టబయలు కావాలి.

వేతనాలు సవరించటం అంటే ఎక్కడయినా సరే వేతనాలు పెరగాలి.

బ్యాంకు, ఇన్సూరెన్సు ఉద్యోగులకయినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకయినా, ఆర్టీసీ, విద్యుత్ ఉద్యోగులకయినా, కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల్లోనయినా, గుర్తింపు కలిగిన యూనియన్లు ఉన్న పరిశ్రమల్లో ఒప్పందాలు జరిగినపుడయినా వేతన సవరణ అంటే వేతనాలు పెరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటి వరకు పది పీఆర్సీలు అమలయ్యాయి. ప్రతిదానిలోనూ వేతనాలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం వేసిన పీఆర్సీ వేతనాల పెంపునకు సిఫార్సు చేస్తుంది. ఆ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం కాస్త తక్కువగానో, అంతకంటే పెంచో ఆమోదిస్తుంది. ఆ పీఆర్సీల వేతనాలు పొందుతున్న లేబర్ అధికారులు మాత్రం కనీస వేతనాల చట్టం కింద వచ్చే కార్మికులకు వేతనాలు యధాతథంగా ఉంచుతూ లేదా తగ్గిస్తూ ఎందుకు ప్రతిపాదనలు చేస్తున్నారు? వారు ప్రతిపాదించినట్లుగా 55 ఎంప్లాయ్‌మెంట్స్‌లో వేతనాల పెరుగుదల లేకుండా ప్రతిపాదించడానికి, 12 ఎంప్లాయ్‌మెంట్స్‌లో వేతనాలు తగ్గించడానికి, కొన్నిట్లో కొసర్లు వేయడానికి ప్రాతిపదికలు ఏమిటి? ముసాయిదా జీఓలు ఇలా ఉంటే ఫైనల్ జీఓ లు ఇంత కంటే గొప్పగా ఉంటాయని ఎలా అనుకోగలం? అంతిమంగా ఏదో నామమాత్రంగా పెంచి చేతులు దులుపుకోవాలనే ఆలోచన ఉన్నట్లు దీనిలో కనబడుతుంది. కనీస వేతనం రూ.18 వేల కోర్కె తరువాత సంగతి. కనీసం ఇప్పుడు ఉన్న వేతనాల మీద 20 శాతమో లేదా 30 శాతమో పెంచాలనే ఆలోచన ప్రభుత్వానికి ఎందుకు రాలేదు? కార్మిక వ్యతిరేక ప్రభుత్వం కాబట్టి అటువంటి కనీస పెంపుదలను కూడా ప్రతిపాదించలేదు.

వీడీఏ విషయంలో కూడా ప్రభుత్వం కార్మికులను మోసగిస్తోంది. 2000 వ సంవత్సరంలో పాయింట్‌కు రూ.10.55 ఉన్న వీడీఏ ను 2006, 2007 సంవత్సరాల్లో రూ.6.55 కు, దానికి దగ్గర్లోనూ తగ్గించింది. వాస్తవంగా వేతనాలు పెంచినా వీడీఏ తగ్గదు. మధ్యతరగతి ఉద్యోగులకు పర్సెంటేజ్ రూపంలో డీఏ బేసిక్ మీద గుణించబడుతుంది (మల్టీప్లై). వారికి వేతనాలు పెరిగినప్పుడు బేసిక్ పెరుగుతుంది. మల్టీప్లై అయ్యే పర్సెంటేజ్ తగ్గుతుంది. కానీ ప్రతి పాయింటుకు వచ్చే డీఏ మాత్రం ఎన్ని సార్లు బేసిక్ వేతనం మారినా యధాతథంగా ఉంటుంది. కనీస వేతనాల చట్టం కిందకు వచ్చే కార్మికులకు డీఏ బేసిక్ మీద మల్టీప్లై కాదు. పాయింటుకు ఇచ్చే వీడీఏ మొదట్లో ఎలా ఉందో అదే కొనసాగుతుంది. కానీ ప్రభుత్వం దుర్మార్గంగా రూ.4, అంతకంటే ఎక్కువగా తగ్గించింది. ఫలితంగా కార్మికులు నెలకు రూ.2 వేలకు పైగా నష్టపోతున్నారు. ఇక నుండైనా ఆ నష్టం నివారణ కావాలంటే పాయింటుకు రూ.10.55 ను పునరుద్ధరించాలి.

ఇది లేబర్ అధికారులు చేస్తున్న పనా? లేక రాష్ట్ర ప్రభుత్వం ఆదేశమా? ప్రభుత్వానికి తెలియకుండా లేబర్ అధికారులు చేసిన పనే అయితే వారిని ఏమి చేయాలో ప్రభుత్వమే తేల్చుకోవాలి. లేదా ప్రభుత్వమే ఆ పని చేస్తుంటే ఆ ప్రభుత్వాన్ని ఏమి చేయాలో కార్మికులే తేల్చుకోవాలి. తెలుగుదేశం ప్రభుత్వ వేతనాలు పెరిగితే పెట్టుబడిదారులు రాష్ట్రానికి రారు కాబట్టి వేతనాలు తగ్గించాలనేది సిద్ధాంతం.

ధరలు పెరుగుతున్న కొద్దీ కార్మికులకు నిజవేతనాలు (డబ్బు వేతనాలతో కొనగలిగే సరుకులు, సేవల పరిమాణం) పడిపోతాయి. అవి డీఏ ఉన్న వారికి డీఏ లేని వారితో పోల్చుకున్నప్పుడు తక్కువ వేగంతో, డీఏ లేని వారికి ఎక్కువ వేగంతో పడిపోతాయి. అందుకే ఎక్కడైనా, ఎవరికైనా వేతన సవరణ అంటే పడిపోయిన నిజవేతనాలను కవర్ చేసే విధంగానూ, పెరిగిపోతున్న కుటుంబ భారాన్ని భరించే విధంగానూ వేతనాలు పెరుగుతాయి. కానీ షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌లోని కార్మికులకు ఇది రివర్స్‌లో ఎందుకు జరుగుతోంది? 50 లక్షల మంది వ్యవసాయేతర ఎంప్లాయ్‌మెంట్స్‌లో ఉన్న కార్మికుల కుటుంబాలకు, మరి కొన్ని లక్షల మంది వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఉన్న ఓట్లు పెట్టుబడిదారుల కంటే వేల రెట్లు ఎక్కువ. రాష్ట్రంలో కోటి మందికి పైగా ఉన్న కార్మిక కుటుంబాలను ఒక పక్క మోసం చేస్తూనే మరో పక్క వారి ఓట్లతో ప్రభుత్వాలు ఎన్నికల్లో ఎలా గెలవగలుగుతున్నాయి?

శ్రమ శక్తికి కనీస విలువ ఇవ్వకుండా శ్రమశక్తిని దోచుకునేందుకు యజమానులకు పాలక పార్టీలు అవకాశం కలిపిస్తున్నాయి. కార్మికులను పథకాల పేరుతో ఏమారుస్తు న్నాయి. అందరికీ ఆధరువుగా నిలుస్తాను, అందరి అభివృద్ధికి పాటుపడతాను అని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం జాతీయ స్థాయి కనీస వేతనాన్ని 2015 సంవత్సరంలో కేవలం రోజుకు రూ.160 గా నిర్ణయించింది. సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో మాత్రమే రోజుకు కనీస వేతనాన్ని రూ.600 గా నిర్ణయించి అమలు చేస్తున్నారు.

ఏపీలో 50 లక్షలకు పైగా ఉన్న కార్మికులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగలగడానికి కారణం వారంతా కార్మిక సంఘాల్లో సంఘటితం కాకపోవడమే. షాపులు, హోటల్స్, ప్రైవేటు హాస్పిటల్స్, ప్రైవేటు విద్యాలయాలు, రవాణా, ఇంటిపనివారలు, పరిశ్రమలు తదితర పనుల్లో ఈ కార్మికులు విస్తారంగా ఉన్నారు. వీరందరినీ సంఘటితం చేయాల్సిన బాధ్యత కార్మికోద్యమానిది. దోపిడీ సమాజాన్ని మార్చాలనే లక్ష్యం కలిగిన కార్మిక సంఘాలకు ఇదొక సవాలు వంటిది. కార్మికులందరినీ సంఘటితం చేయకుండా, వారిలో చైతన్యం కలిగించకుండా సమాజాన్ని మార్చగలగడం అసాధ్యం. కార్మికోద్యమం ఈ బాధ్యతను గుర్తిస్తుందని ఆశించాలి.

కలెక్టరేట్లను ముట్టడించిన ఆశాలు

ఆశా వర్కర్ల గౌరవ వేతనాలు, పారితోషికాలపై విధించిన సీలింగ్‌ను రద్దు చేయాలని, జీవో 113ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ యూనియన్


పశ్చిమగోదావరి

(సిఐటీయు) రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఆశా వర్కర్లు చలో కలెక్టరేట్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. పలు జిల్లాల్లో పోలీసులు ఆశా వర్కర్లపై విరుచుకు పడ్డారు. అక్రమంగా అరెస్టు చేశారు.

శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నాలో 319 మందిని అరెస్టు చేశారు. విశాఖపట్నం పాడేరు ఐటీడీఏ కార్యాలయం డీఎం అండ్ హెచ్ఓ దగ్గర 750 మందితో ధర్నా జరిగింది. ధర్నాకు బయలుదేరిన ఆశా వర్కర్లను నర్సీపట్నంలో 26 మందిని, అనకాపల్లిలో 11 మందిని, నక్కపల్లిలో 11 మందిని అరెస్టు చేశారు. కాకినాడలో కదంతొక్కారు. కలెక్టరేట్ వద్ద మండుటెండలో మూడు గంటలపాటు వందలాదిమంది ధర్నా నిర్వహించారు. చింతూరులో ఎర్రంపేట నుంచి ఐటీడీఏ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏను ముట్టడించి, ఏవీఓ పి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

రంపచోడవరం


గుంటూరు

పశ్చిమగోదావరి జిల్లా నలు మూలల నుంచి ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. వంద లాదిగా తరలిరావడంతో బారి కేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటు చేసి, మహిళా పోలీసులను మోహరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరి ధర్నా ప్రాంతానికి చేరుకుని ఆశాలనుద్దేశించి మాట్లాడారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఆశాలు ధర్నా చేపట్టారు. ఒంగోలులోని ప్రకాశం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. చర్చి సెంటర్ లో మానవహారం నిర్మించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత స్థానిక వీఆర్‌సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు ఆందోళన చేస్తున్న ఆశాలను చుట్టుముట్టి 150 మందిని బలవంతంగా అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆశా వర్కర్ల డిమాండ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్యలను యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్‌వి రత్నం, కె.ధనలక్ష్మి సచివాలయంలో కలిసి వినతి పత్రాలను అందజేశారు. పదేళ్ల సీనియార్టీ ఉన్న ఆశా వర్కర్లు పని నుంచి వైదొలిగితే రూ.20 వేలు చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, దీనిని కూడా జీవోలో చేర్చాలని కోరారు. ఏటా యునిఫాం, అలవెన్స్ విషయం కూడా జీవోలో చేర్చాలన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అనిల్ చంద్ర పునేఠా నాయకులకు తెలిపారు.

మిడ్డేమీల్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రభుత్వ పాఠశాలల్లో 15 సంవత్స రాలుగా పనిచేస్తున్న వర్కర్లకు ఉద్వాసన పలికేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. పొమ్మని చెప్పకుండా పొగ పెట్టేందుకు అనేక విధాలుగా తిప్పలు

పెడుతోంది. సబ్సిడీ గ్యాస్ ఎత్తివేత, కట్టెల మీద వంట చేయరాదనే ఆంక్షలు, బిల్లులు, వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడం, కోడిగుడ్డు సరఫరా కాంట్రాక్టర్‌ను తొలగించి వర్కర్లనే కొనుగోలు చేయాలని చెప్పడం, కందిపప్పు, ఆయిల్ ప్రభుత్వం సరఫరా చేసి మెనూ చార్జీల నుండి అధిక మొత్తంలో కోత పెట్టడం వంటి ఇబ్బందులకు గురిచేస్తోంది. రాష్ట్రంలో ఉన్న మొత్తం స్కూల్స్‌ను 71 క్లస్టర్స్‌గా చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తోంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా వర్కర్లలో తీవ్రమైన ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రాథమిక విద్యార్థులకు రూ.4.13 చొప్పున, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.6.18 చొప్పున అందచేస్తోంది. ఈ చార్జీల్లోనే కందిపప్పు, వంటనూనె, వంటగ్యాస్, కూరగాయలు, పప్పుదినుసులు, చింతపండు, దినుసులు, ఉప్పు, కారం, పసుపు మొదలైన వస్తువులు వర్కర్ కొనుగోలు చేయాలి. ప్రాథమిక పాఠశాలలకు కందిపప్పుకు 20 గ్రాముల చొప్పున రూ.1.30, ఆయిల్‌కు రూ.0.58 కోత పెడుతున్నారు. పై తరగతి విద్యార్థులకు రూ. 2.07 కందిపప్పుకు, ఆయిల్‌కు రూ. 0.87 చొప్పున రూ. 3.24 కోత పెడుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలు 45,504 ఉండగా అందులో 38,19,638 మంది విద్యార్థులు మధ్యాహ్నభోజనం చేస్తున్నారు.

2016 జూలైలో నిర్ణయించిన మెనూ చార్జీలు రెండు సంవత్సరాలు పూర్తయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచలేదు. పైగా నాణ్యమైన భోజనం పెట్టడం లేదని కార్మికులపై నెపం వేస్తున్నారు. గ్యాస్ సబ్సిడీపై ఇవ్వాల్సిన ప్రభుత్వం సబ్సిడీ ఎత్తి వేయడంతో రూ.960 కు సిలిండర్ కొను గోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

అన్నా క్యాంటీన్లకు రూ.72 చెల్లించే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మాత్రం మెనూ చార్జీల పెంపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 2007లో నిర్ణయించిన వేతనం రూ.1,000 ను 11 సంవత్సరాలైనా పెంచలేదు. ఐదారేళ్లుగా పనిచేస్తున్న వర్కర్లకు వేతనం పెంచకపోగా పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తోంది. వారానికి 5 గుడ్లు పెరిగినా కుకింగ్ చార్జీలు పెంచలేదు. రాష్ట్ర వ్యాప్తంగా వర్కర్లు ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే సమస్య పరిష్కరించకుండా నిర్బంధంతో ఉద్యమాన్ని అణచివేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు పథకాన్ని

అప్పగించడం విరమించు కోవాలని విశాఖలో నవప్రయాస సంస్థకు అప్పగించడాన్ని నిరసిస్తూ కిచెన్ షెడ్ల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి.

ప్రైవేటు సంస్థలకు పథకాన్ని అప్పజెప్పరాదని, వేతనాలు, మెనూ చార్జీలు పెంచాలని నవంబర్ 19న ఢిల్లీలో పార్లమెంట్ ముందు ధర్నా జరుగుతుంది.

షాపింగ్ మాల్స్‌లో పని చేసే మహిళలకు కూర్చునే హక్కులు కల్పించిన వామపక్ష కేరళ ప్రభుత్వం



షాపింగ్ మాల్స్, బంగారం దుకాణాలు, గ్రాసరీ షాప్స్ లాంటి వాటిల్లో పనిచేసే సేల్స్ గర్ల్స్.. వారు పనిచేసినంత సేపు నిలబడే ఉంటారు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఉండవు.

ఉన్నా కూర్చోడానికి వారికి ఖాళీ కూడా ఉండదు. కష్టమర్స్ లేకున్నా వారంతా నిలబడి ఉండాల్సిందే. అమ్మాయిలకు ఈ రూల్ నరకంగా ఉండేది. పర్సనల్ ప్రాబ్లమ్స్ వచ్చినప్పుడు వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. వామపక్ష కేరళ ప్రభుత్వం ఇప్పుడు వారికి ఆ బాధ నుంచి ఉపశమనం లభించేలా చేసింది.

పనిభారం తగ్గించాలి వేధింపులు ఆపాలి

ఏలూరులో అంగన్‌వాడీ వర్కర్ వనివత్తిడి వలన గుండెపోటుతో మరణించారు. రాయవరంలో అధికారుల వేధింపులకు తిక్కక్క మరణించింది. వారికుటుంబాలు రోడున పడ్డాయి.

అంగన్‌వాడీల చేత ఆదివారం కూడా ఎమ్మార్వో, కలెక్టరు గారి ఆర్డరు అంటూ బీఎల్‌ఓ డ్యూటీలు, అర్ధరాత్రి వరకు ఆన్ లైన్ పని చేయిస్తున్నారు. 5 నెలల నుండి కూరగాయబిల్లులు ఇవ్వలేదు. సెంటర్ అద్దెలు, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, టీఏ బిల్లు సంవత్సరాల తరబడి బకాయిలు ఉన్నాయి. అయినా అంగన్‌వాడీలది తల్లి మనస్సు. పెట్టుబడి పెట్టి పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు తిండి పెడుతున్నారు.



కానీ ప్రభుత్వం మనలను దొంగలుగా చూపిస్తోంది. పర్యవేక్షణ కమిటీలు వేస్తోంది. ఏసీబీతో దాడులు చేయించి అవమానానికి గురి చేస్తోంది. మౌనంగా భరిద్దామా! ప్రతి ఘటిద్దామా!

ఆలోచించండి: అధికారపార్టీ నాయకుల అక్రమాలు అన్నీఇన్నీకావు. అమరావతి, విశాఖలో భూములు కాజేశారు. ఇసుకను మింగుతున్నారని అడ్డుకున్న అధికారి వనజాక్షిను జుట్టు పట్టుకుని ఈడ్చారు. అమరావతిలో తాత్కాలిక రాజధాని బిల్డింగ్స్‌కు అడుగుకు రూ.250 కడతారు. కానీ ప్రభుత్వం అడుగుకు రూ.1,200 చెల్లించింది. పోలవరంలో రూ.కోట్లు పక్కదోవ పట్టినట్లు 'కాగ్' సైతం నివేదిక ఇచ్చింది. పట్టిసీమలో కోట్లాది రూపాయల అవినీతి జరిగింది. అంగన్‌వాడీ సెంటర్లకు పాలు, గుడ్లు కాంట్రాక్టర్లు నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నారు. వాళ్లమీద చర్యలు ఎందుకు లేవు? వీరికి కాంట్రాక్టులు కట్టబెట్టడంలో ఎవరి వాటాలు ఎంతో?

ఇవన్ని వదిలేసి పిచ్చుకమీద బ్రహ్మాస్త్రంలా అంగన్‌వాడీ సెంటర్లలో ఏసీబీ దాడులు వార్తలు చూసే ఉంటారు. అంగన్‌వాడీల్లో అక్రమార్కులని ఒక పేపర్‌లో, గుడ్లు మింగేస్తున్నారని ఒక పేపర్‌లో ఇలా రకరకాలుగా వార్తలు వచ్చాయి. విజిలెన్స్ వాళ్లు 12 జిల్లాల్లో తనిఖీలు చేశారు. ఆహార పదార్థాలు నాణ్యత లేవు. గుడ్లు పాడయిపోయాయి. బాల సంజీవిని బాగాలేదు. సెంటర్‌లో ప్రీస్కూల్ హాజరు తక్కువ ఉంది. ఇది వాళ్ల పరిశీలనలో వచ్చిన అంశాలు. కానీ పత్రికల వాళ్లు అత్యుత్సాహం ప్రదర్శించి హెడ్ లైన్సు అదరగొట్టారు. ఎక్కడయినా ఫీడింగు నిల్వలు సక్రమంగా లేవని కానీ ఫీడింగు అమ్ముకుంటున్నామని కానీ రిపోర్టు రాలేదు. ఒకటి అర పొరపాటు ఉన్నా అవి పాలకుల అనుయాయుల కనుసన్నల్లోనే జరుగు తున్నాయి.

ఫీడింగు నాణ్యత లేక పోవటానికి కారణం ఎవరు? ప్రభుత్వమేగా గుడ్లు సరఫరా చేసేది? గుడ్లు వాళ్లతో కాంట్రాక్టు ఒప్పందం ప్రభుత్వమేగా చేసుకుంది? శెనగలు పురుగులు పట్టినవి ఇస్తున్నారు. వాళ్లని వదిలిపెట్టి అంగన్ వాడీలదే తప్పున్నట్టు ప్రభుత్వమే ప్రచారం చేస్తోంది. టీవీ సీరియల్‌లో కూడా కార్యకర్త గుడ్లుపాలు అమ్ముకుంటున్నట్లు చూపించారు. కుక్కని చంపాలంటే పిచ్చి కుక్క అని ముద్ర వేస్తారు. అలానే మనల్ని ఇంటికి పంపటానికి ప్రభుత్వం తంటాలు పడుతోంది. మన సెంటర్లను కార్పొరేట్లకు అప్పగించాలని కుట్రలు పన్నుతోంది.

పర్యవేక్షణ కమిటీలు వేయటం కోసం, సెంటర్లను మెర్జ్ చేయటం కోసం, కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం [illegible]ట్టడం కోసం ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. ప్రభుత్వ కుట్రలను తిప్పికొడదాం. గతంలో పోరాటం చేసి మదర్ కమిటీలను రద్దు చేసుకున్నాం. ప్రభుత్వంతో పోరాడి తెలంగాణాలోలాగే వేతనాలు పెంచుకున్నాం. బయోమెట్రిక్ ఆపగలిగాం. మనల్ని బలహీనపర్చటం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అంగన్ వాడీలను నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొడదాం. ప్రభుత్వం నాణ్యమైన ఫీడింగ్ సరఫరా చేయాలి. కేంద్రప్రభుత్వం పెంచిన వేతనం రాష్ట్రంలో అమలు చేయాలి. సెంటర్ల మెర్జ్ ఆపాలి. పర్యవేక్షణ కమిటీలను రద్దు చేయాలి. జిల్లాల్లో బకాయిలు విడుదల చేయాలని ప్రాజెక్టుల వద్ద జరిగే ధర్నాల్లో అందరం పాల్గొని జయప్రదం చేద్దాం.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని హెల్పర్లు అనేక సంవత్స రాలుగా వర్కర్ పోస్టులు ఖాళీగా ఉంటే అదే గ్రామంలో హెల్పర్లు 10వ తరగతి పాసై ఉంటే ఆమెకు ప్రమోషన్ ఇస్తున్నారు. ఇటీవల హెల్పర్‌కు 10 సంవత్సరాల సీనియార్టీ ఉంటేనే ప్రమోషన్లు ఇవ్వాలని మెమో నెం.16037/15/2018ను రద్దు చేయాలని, అంగన్‌వాడీల సెంటర్లపై పర్యవేక్షణ కమిటీలను రద్దు చేయాలని, బకాయిలను వెంటనే ఇవ్వాలని, వర్కర్ల, హెల్పర్ల, సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీలను వేధించే పర్యవేక్షణ కమిటీలను రద్దు చేయాలని పరిష్కరించాలని సీడీపీఓ లకు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు వినతిపత్రాలు ఇచ్చారు.

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పనిభారం, బిఎల్ఓ డ్యూటీల ఒత్తిడికి ఝాన్సీరాణి గుండెపోటుతో మరణించింది. దీనికి నిరసనగా బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా జరిగింది. 400 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి కుమార్తెకు ఉద్యోగం ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు ఇవ్వాలని కోరుతూ పీడీ కి, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిఐటియు కార్యదర్శి ప్రసాద్, యూనియన్ నాయకులు పి.భారతి, జయలక్ష్మి, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పెంచి వేతనాలను ఆంధ్రాలో కూడా అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో ప్రాజెక్టు ఆఫీసుల వద్ద ధర్నాలు, ఆందోళనలు జరిగాయి. సమస్యలను

పీఓ వైఖరిని నిరసిస్తూ అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా: అనకాపల్లి అంగన్‌వాడీ టీచర్లపై ప్రాజెక్టు అధికారి రత్నకుమారి వేధింపులకు పాల్పడుతున్నారంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మండలంలోని గుండాల జంక్షన్ అంగన్‌వాడీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగశేషు మాట్లాడుతూ ప్రాజెక్టు అధికారి వేధింపులతో కార్యకర్తలు సతమతవుతున్నారన్నారు. వేధింపులు విడనాడకపోతే ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు బకాయిలు వెంటనే మంజూరు చేసి యజమానుల నుంచి సిబ్బందికి రక్షణ కల్పించాలని, కార్యకర్తలకు సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.కుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్యకర్తలకు ఇస్తున్న రూ.1,500, ఆయాలకు ఇస్తున్న రూ.750 ఈ ఏడాది ఆగస్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయుపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

విశాఖ జిల్లా నర్సీపట్నం ప్రాజెక్టు నుండి, కడప జిల్లా కమలాపురం, లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టుల నుండి అంగన్‌వాడీలు ఏఐటియుసి నుండి సిఐటియులో చేరినప్పటి చిత్రం.



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సత్యాగ్రహాలు

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 3 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయలేదు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్లు, వర్కర్ల / జేఏసీ, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలను ఉద్యోగులు నిర్వహించారు. సమస్యలను పరిష్కరిం చమని కోరుతూ నవంబర్ 15న రాష్ట్రవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్నారు.

10 పీఆర్‌సీ అనంతరం గతంలో వలే రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్‌తో సమానంగా వేతనాలను పెంచకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను 3 కేటగిరీలుగా విభజించి వేతనాలు తక్కువగా పెంచారు. ఇస్తున్న వేతనాలనూ నెలనెలా చెల్లించడం లేదు. ప్రమాదాల్లో మరణించినా, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచుతామని, రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల మానిఫెస్టోలో టీడీపీ ప్రకటించింది. 4 సంవత్సరాలు దాటినా రెగ్యులరైజ్ చేయలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ ఉద్యోగులు కారని కొంత మంది మంత్రులు, అధికారులు అంటున్నారు. ఇది సరైనది కాదు. చట్ట ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బాధ్యత ప్రధాన యజమానిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వానిదే. చట్ట ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలి. సివిల్ అప్పీల్ 213 ఆఫ్ 2013 కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కూడా సమాన

పనికి సమాన వేతనం చెల్లించాలి.

***1.* 2/94 చట్టాన్ని సవరించి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చెయ్యాలి.**

***2.* రెగ్యులరైజేషన్‌లోగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు అమలు చేయాలి.**

3. మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు సౌకర్యం కల్పించాలి.

4. డీఏ, హెల్త్ కార్డులు, బస్‌పాస్ సౌకర్యాలు, అందరికీ ఉద్యోగ భద్రత, విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలి. రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

5. 11వ పీఆర్‌సీని ప్రారంభ తేదీ నుండి వర్తింపచేయాలి. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఐఆర్ చెల్లించాలి.

6. ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు చెల్లించాలి. పీఎఫ్, ఈఎస్ఐ లు సక్రమంగా అమలు చేయించాలి.

7. విద్యారంగంలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంవత్సరంలో 12 నెలలకూ వేతనాలు చెల్లించాలి.

8. వివిధ ప్రభుత్వ సంస్థలు, పథకాల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలి.

9. సర్వశిక్షా అభియాన్‌లో గతంలో మాదిరి కాంట్రాక్టు నియామకాలు మాత్రమే కొనసాగించాలి. పార్ట్‌టైం ఉద్యోగులను ఫుల్ టైమర్స్‌గా మార్చాలి.

10. నేషనల్ హెల్త్ మిషన్‌లో 35 క్యాజువల్ లీవులు అమలు చేయాలి. ఒకే కేడర్-ఒకే వేతనం విధానాన్ని అమలు చేయాలి. పారా మెడికల్ సిబ్బందికి గతంలో వలే గ్రాస్ శాలరీ వర్తింపజేయాలి.

11. జీఓల ప్రకారం పూర్తి వేతనాన్ని చెల్లించే పద్ధతిని అన్ని శాఖల్లో అమలు చేయించాలి. ఇన్సెంటివ్ పద్ధతుల పేరిట జీఓలో నిర్ణయించిన వేతనాల కంటే తక్కువ వేతనాలను చెల్లించే విధానాలను రద్దు చేయాలి.

12. వర్క్ కాంట్రాక్టు, సర్వీస్ ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలి.

రైల్వే కాంట్రాక్టు కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలి

అక్టోబర్ 1 నుండి 25వ తేదీ వరకు తిరుపతి, రేణిగుంట, విజయవాడ, రాయనపాడు, నర్సాపురం, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలోని వివిధ డిపార్ట్‌మెంట్స్‌లో ఉన్న రైల్వే కాంట్రాక్టు కార్మికులతో సుప్రీంకోర్టు తీర్పును సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని నిరసన ప్రదర్శనలు జరిగాయి. కాంట్రాక్టర్స్ జీఓ రేటు ప్రకారం వేతనం రూ.462 అయితే ఇస్తున్నది



రూ.282 మాత్రమే. జీతాలు సకాలంలో చెల్లించకపోవడం జరుగుతుంది. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవు. రైల్వే అధికారులు కాంట్రాక్టర్‌తో అమలు చేయించే బాధ్యత తీసుకోవడం లేదని ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని నాయకులు నర్సింహులు, సుభాని పేర్కొన్నారు.

జీఓ నెం.279 రద్దు కోసం రైల్వే కార్మికులు రాష్ట్రవ్యాప్త సమ్మెకు సంఘీభావం తెలిపారు. విజయవాడలోని రైల్వే కాంట్రాక్టు కార్మికులు రైల్వే స్టేషన్ నుండి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ఊరేగింపు జరిపి సభ నిర్వహించారు. రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుభానీ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నా

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, యూనివర్శిటీలు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలని, మహిళా ఉద్యోగులకు 6 నెలలు



పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగులకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, రెగ్యులరైజ్ చెయ్యాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 11వ పీఆర్సీ ప్రారంభపు తేదీ నుండి ఇవ్వాలని కోరుతూ విజయనగరం జిల్లా కలెక్టరు ఆఫీసు వద్ద జరిగింది.

'అరబిందో' కార్మికుల న్యాయదీక్ష

అరబిందో కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ న్యాయదీక్షను శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.నర్సింగరావు ప్రారంభించారు. ప్రపంచంలోనే అత్యధిక లాభాలు ఆర్జిస్తున్నవి ఫార్మా కంపెనీలు, కార్మికుల కష్టార్జితంతో వేల కోట్ల రూపాయలు లాభాలు అర్జిస్తున్న అరబిందో యాజమాన్యం కార్మికులకు మాత్రం అతి తక్కువ వేతనాలు ఇస్తూ తీవ్ర శ్రమ దోపిడీకి గురిచేస్తోందన్నారు. వెంటనే అరబిందో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జీడీ, రైస్ మిల్లు కార్మికుల ధర్నా

వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ యాక్షన్ డే

అందరికీ సామాజిక భద్రత, ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాలే అందించాలి

అక్టోబరు 3 వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యూఎఫ్‌టీయూ) ఆవిర్భవించిన రోజు. 2018 అక్టోబరు 3 ను అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవంగా డబ్ల్యూఎఫ్‌టీయూ ప్రకటించింది. అందరికీ ప్రభుత్వ సామాజిక భద్రత - అందరికీ ఉచిత వైద్యం ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని డబ్ల్యూఎఫ్‌టీయూ నిర్ణయించింది. డబ్ల్యూఎఫ్‌టీయూ పిలుపు మేరకు విజయవాడ లెనిన్ సెంటర్‌లో సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టీయూ, ఏఐయూటీయూసీ, ఇన్సూరెన్స్, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ తదితర ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా మానవహారాన్ని నిర్మించాయి. ప్లకార్డ్స్ ప్రదర్శించి నినాదాలు ఇచ్చాయి.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.గఫూర్ ప్రసంగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించాలని, అందరికీ వైద్య సౌకర్యం కల్పించాలని, కార్మిక చట్టాలను అసంబద్ధంగా సవరించరాదని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనాలు పెంచాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్య దర్శి కె.పొలారి మాట్లాడుతూ భారత దేశంలో, రాష్ట్రంలో కార్మికులకు, ప్రజలకు నష్టదాయకమైన విధానాలను పాలకులు అవలంబిస్తున్నారని, కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు ప్రభుత్వాలు చేపట్టాలని, స్థిర ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. ఏఐయూటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధీర్ ప్రసంగిస్తూ ట్రేడ్ యూనియన్ హక్కులు, ప్రజాస్వామ్య హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, కార్పొరేట్ల ప్రయోజనం కోసమే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా ఉద్య మించాలన్నారు.

కార్యక్రమంలో సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐయూటీయూసీ సంఘాలు ఢిల్లీలో రైతులపై ప్రభుత్వం ప్రయోగించిన నిర్బంధాన్ని, దాడిని, త్రిపురలో బీజేపీ ప్రభు త్వం దేశర్‌కథ్ పత్రికను నిషేధించడాన్ని తీవ్రంగా ఖండించాయి. బీజేపీ ప్రభుత్వాలు ఇటువంటి అప్రజాస్వామిక పద్ధతులను విడనాడాలని డిమాండ్ చేశాయి.

డబ్ల్యూఎఫ్‌టీయూ నేడు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ చేస్తున్న సమస్యలతో పాటు మన దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న క్రింది సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశాయి.

1) అందరికీ సామాజిక భద్రత, ఉచిత విద్య, వైద్యసౌకర్యాలు కల్పించాలి.

ఈ డిమాండ్స్‌తో పాటు అనేక దేశాల్లో కార్మిక వర్గం రోజుకు 7 గంటలు చొప్పున వారానికి 5 రోజులు, 35 గంటల పని దినం, సమిష్టి బేరం హక్కు, ట్రేడ్ యూనియన్, ప్రజాస్వామిక హక్కులు, స్థిరమైన ఉద్యోగాలు తదితర డిమాండ్స్ కోసం పోరాడుతున్నారు. మన దేశంలో ధరల నియంత్రణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, కార్మిక చట్టాల అమలు, యజమానులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకముగా కార్మిక చట్టాలకు తలపెట్టిన సవరణల విరమణ, అందరికీ సార్వత్రిక సామా జిక భద్రత, రూ. 18 వేల కనీస వేతనం, అందరికీ నెలకు రూ.3 వేలకి తగ్గకుండా పెన్షన్, ప్రభుత్వ రంగ సంస్థల డిజిన్వెస్టుమెంట్ విరమణ, శాశ్వత పనుల్లో కాంట్రాక్ట్ వర్కర్ల నియామకం విరమణ, కాంట్రాక్ట్ వర్కర్లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమంగా సమాన పనికి సమాన వేతనాలు, బోనస్, పీఎఫ్ ల పై సీలింగుల తొలగింపు, గ్రాట్యుటీ పెరుగుదల, అప్లికేషన్ పెట్టిన 45 రోజుల్లోగా యూనియన్ రిజిస్ట్రేషన్, యూనియన్ పెట్టుకోడానికి, సమష్టి సంప్రదింపులకు గ్యారంటీ ఇచ్చే అంతర్జాతీయ కార్మిక సంస్థ కన్వెన్షన్ 87, 98 లను భారత ప్రభుత్వం ఆమోదించాలి. రైల్వే, ఇన్సూరెన్సు, రక్షణ రంగాల్లో ఎఫ్‌డీఐ లను నిలుపుదల చేయాలి.

ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని రెగ్యులర్ చేయాలని రిలే దీక్ష

ఏలూరు: ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి పదో పీఆర్‌సీకి అనుగుణంగా వేతనాలు పెంచి అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల సిబ్బంది మూడు రోజుల రిలే నిరాహార దీక్షను పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పదో పీఆర్‌సీ ప్రకటించి నాలుగు సంవత్సరాలు గడిచిందని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచుతూ ఇచ్చిన జీవో 151 ప్రకటించి రెండు సంవత్సరాలు దాటిందని, అయినా నేటికీ పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి వాటిని అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని అపోలో సంస్థకు అప్పగించిన తర్వాత వేధింపులు పెరిగాయంటూ వీటిని అరికట్టాలని కోరారు. నాలుగు నెలల బకాయి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షురాలు చోడే పోశారత్నం అధ్యక్షత వహించారు. ఆరోగ్య కేంద్రాల సిబ్బంది మహాలక్ష్మి, శ్యామల, గ్రేస్ కమల, విక్టోరియా కుమారి, బేగం, శ్రీదేవి తదితరులు నాయకత్వం వహించారు.

ప్రైమ్ హైటెక్ లాకౌట్ ఎత్తివేయాలి

నెల్లూరు: నాయుడుపేట మేనకూరు సెజ్‌లో ప్రైమ్ కంపెనీ యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసింది. ఈ సందర్భంగా ప్రైమ్ గేట్ మూసి గేట్ల ముందు కార్మికులు ధర్నాకు దిగడంతో యాజమాన్యం సిఐటియు నాయకులు, కార్మికులతో యాజమాన్యం చర్చించింది. కొన్ని నెలలు వ్యవధి కావాలని అడిగింది. ప్రైమ్ హైటెక్ ఇంజినీరింగ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని, కార్మికులకు రావలసిన నాలుగు నెలల వేతనం ఇచ్చి లాక్ అవుట్ తొలగించిన తరువాత వారికి రావలసిన ఇతర బకాయిలు ఎన్ని రోజుల్లో ఇస్తారో రాతపూర్వకంగా ఇచ్చాక ఇతర విషయాలు చర్చిస్తామని సిఐటియు నాయకులు యాజమాన్యానికి స్పష్టం చేశారు. కార్మికులకు నాలుగు నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా పరిశ్రమను లాక్ ఆఫ్ చేసిన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఐఎన్‌టియుసి నాయకులు పేర్కొన్నారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు.

సీఐటీయూలో చేరిక

ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐఎన్‌టీయూసీకి చెందిన 20 మంది కార్మికులు సీఐటీయూలో చేరారు. అనపర్తి ఐఎల్‌టీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసంశెట్టి వెంకట్రావు సమక్షంలో వారు సీఐటీయూలోకి చేరారు. సీఐటీయూ కండువాలు కప్పి వారిని యూనియన్‌లోకి వెంకట్రావు ఆహ్వానించారు.

సీఐటీయులో చేరిన కార్మికులు

శ్రీకాకుళం తిత్లీ తుఫాను వరద బాధితుల కోసం



విష్ణు నివాసం కార్మికుల విజయం

గత ఏడాదిగా టీటీడీ కాంట్రాక్టు కార్మికులను వేదించుకుతింటున్న ముఖ్యమంత్రి బంధువు, కాంట్రాక్టర్ భాస్కర్ నాయుడుపై తిరుపతి విష్ణు నివాసం కార్మికులు విజయం సాధించారు.

కార్మికులపై తప్పుడు కేసులు పెట్టించడం, మహిళలను లైంగికంగా వేధించటం, బదిలీల పేరుతో కక్ష సాధించటం, ఉద్యోగాల నుంచి తొలగిచటం, పని భారం పెంచటం వంటి చేష్టలతో కార్మికులను అడుగడుగునా ఇబ్బంది పెట్టిన కాంట్రాక్టర్ కార్మికుల పోరాట పటిమ ముందు తలవంచక తప్పలేదు.

తిరుపతి రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఉన్న విష్ణు నివాసం 600 గదులతో భక్తులకు వసతిని సమకూర్చే సముదాయం పదేళ్లుగా కార్మికులు పని చేస్తున్నారు. యూనియన్‌ను నిర్వీర్యం చేయాలన్న ఉద్దేశంతో భాస్కర్ నాయుడు కాంట్రాక్టు పొందిన రోజు నుంచే కార్మికులను ఇబ్బందులపాలు చేశారు. పలుమార్లు టీటీడీ ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు కార్మికులు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. 300 మంది కార్మికులు విధిలేని పరిస్థితుల్లో వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేశారు. రేయింబవళ్లు విష్ణు నివాసం దగ్గరే ఉంటూ భక్తులకు ఇబ్బంది కలిగించకుండా పనులు చేస్తూ 24 గంటల నిరసన కార్యక్రమాన్ని 15 రోజులు పాటు నిర్వహించారు. కాంట్రాక్టర్, అధికారుల వైఖరిలో మార్పు రాకపోగా పోరాటానికి నాయకత్వం వహిస్తున్న గోపీనాథ్, తులసీరామ్, అన్నపూర్ణ, రజనీలను ఉద్యోగాల నుంచి తొలగించారు.

కార్మికులు నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. కాంట్రాక్టర్ పోటీ కార్మికులను తీసుకురావాలని చేసిన ప్రయత్నాన్ని ఎదుర్కొన్నారు. కార్మికులతో పాటు ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులరెడ్డి, చంద్రగిరి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నగరి ఎంఎల్ఏ ఆర్.కె.రోజాతో పాటు అన్ని ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు భాగస్వాములయ్యారు. విష్ణు నివాసం దగ్గరే నిరవధికంగా ధర్నాలు, రాత్రిళ్లు నిద్రించటం వంటి కార్యక్రమాలతో తిరుపతి నగరమంతా పెద్దఎత్తున చర్చగా మారింది.

విధిలేని పరిస్థితుల్లో తిరుమల జేఈఓ శ్రీనివాసరాజు (ఐఏఎస్), టీటీడీ ఇంజినీరింగ్, విజిలెన్స్ అధికారులు తొలగించిన కార్మికనేతలందరినీ పనిలోకి తీసుకుంటామని, కక్షసాధింపు బదిలీలు రద్దు చేస్తామని, కేసులు ఎత్తి వేస్తామని, చట్టబద్ధ సౌకర్యాలు అందిస్తామని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటా మని హామీ ఇవ్వటంతో కార్మికులు పోరాటాన్ని విరమించారు. భాస్కర్ నాయుడు వ్యవహరించిన తీరును పలువురు తీవ్రంగా విమర్శించారు. టీటీడీ యాజమాన్యం కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయటమే కాకుండా, భాస్కర్ నాయుడిపై రూ. 12 లక్షలు జరిమానా విధించింది. పోరాడి విజయం సాధించిన సిఐటియును పలువురు అభినందించారు.

సిఐటియు అండతో ఇస్కాన్ కార్మికుల విజయం

దక్షిణాది రాష్ట్రాల్లో బెంగళూరు తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగినది తిరుపతి ఇస్కాన్ మందిరం. అనేక మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తుంటారు. పదేళ్లుగా మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికులకు యాజమాన్యం చట్టబద్ధ సౌకర్యాలు కల్పించటం లేదు. దీంతో కార్మి కులు సిఐటియును ఏర్పాటు చేసుకున్నారు.

52 మంది కార్మికులు పదేళ్లుగా చట్టబద్ధ సౌకర్యాలు కల్పించటం లేదని సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక శాఖాధికారులకు యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళనకు వెళ్లాల్సి వస్తుందని సిఐటియు నేతలు హెచ్చరించన నేపథ్యంలో నగరంలోని ప్రముఖ న్యాయవాది ఇరుగు గురుస్వామి జోక్యంతో యాజమాన్యానికి కార్మికులకు మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. చివరకు రూ. 42 లక్షలు చెల్లించటానికి యాజమాన్యం అంగీకరిం చింది. కార్మికులు. యాజమాన్యం మధ్య ఒప్పందం కుదిరింది. సమస్య పరిష్కారానికి తోడ్పడిన ఇస్కాన్ అధినేత రేవతీ రమణీదాస్, న్యాయవాది గురుస్వామి, డీసీఎల్ విద్యాసాగర్‌కు కార్మికులు ధన్యవాదాలు తెలియజేశారు.

విజయవంతమైన భవన నిర్మాణ కార్మికుల అఖిల భారత మహాసభలు

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అఖిల భారత మహాసభ అక్టోబర్ 24 నుంచి 26 వరకు మహారాష్ట్రలోని షోలా పూర్ పట్టణంలో జరిగింది. మహాసభకు 25 రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు హాజర య్యారు. ఇండో నేషియా నుంచీ డబ్ల్యూఎఫ్ టీయూ (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూని యన్స్) ప్రతినిధులు హాజరయ్యారు. సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి కా॥తపన్‌సేన్, కార్యదర్శి కా॥దేవరాయ్, కేరళ ప్రధాన కార్య దర్శి కా॥ఎలమారెమ్ కరీం (ఎం.పి.రాజ్యసభ), పశ్చిమబెంగాల్ కార్యదర్శి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలతో కలిపి 22 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

దేశంలో నిర్మాణ రంగంలో ఎదుర్కొం టున్న సమస్యలను ఈ మహాసభ చర్చించింది. నాలుగు సంవత్సరాల కాలంలో జరిగిన కార్య కలాపాలు, దేశంలో వివిధ రాష్ట్రాల్లో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు అమల వుతున్న సంక్షేమ పథకాల నివేదికను సీడబ్ల్యూ ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి ప్రవేశపెట్టారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కర్తవ్యాలను ప్రతిపాదించారు.

ముఖ్య అతిధిగా హాజరయిన సిఐటియు ప్రధాన కార్యదర్శి కా॥తపన్‌సేన్ ప్రారంభ ఉపన్యాసంలో దేశంలో 20 కోట్లకు పైగా నిర్మాణ కార్మికులు ఉంటే అన్ని రాష్ట్రాల్లో కలిపి 3,06,90,852 మందిని మాత్రమే వెల్ఫేర్ బోర్డులో ప్రభుత్వాలు రిజిస్ట్రేషన్ చేశా యన్నారు. 3 లక్షల కోట్లకు పైగా వసూలు చేయాల్సిన సెస్ నిధులను రూ.42,505.78 కోట్లు మాత్రమే వసూలు చేశారన్నారు. అరకొరగా మాత్రమే రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిధుల నుంచి కార్మిక సంక్షేమ పథకాలను ఆయా రాష్ట్ర ప్రభు త్వాలు ఖర్చు చేశాయ న్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ మెరుగైన సంక్షేమ పథకాల అమలు కోసం నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలన్నారు.

కేరళలోని వామపక్ష ప్రభుత్వం సెస్ వసూలు చేయడంలో, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశంలోనే ఆదర్శంగా ఉందన్నారు. కేరళలో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్‌బోర్డులో నమోదు చేసుకున్న అర్హులైన కార్మికులకు నెలకు రూ. 3 వేలు పెన్షన్ ఇస్తోందన్నారు. సెస్ ద్వారా వసూలైన నిధులు మాత్రమే కాకుండా కేరళ ప్రభుత్వం ఏటా తన బడ్జెట్‌లో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుకు గ్రాంట్ ఇస్తోందన్నారు. రకరకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేరళ బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఇప్పుడు నిధుల లేమి సమస్యను ఎదుర్కొంటోందన్నారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం పెన్షన్ చెల్లించడానికి కేంద్ర ప్రభు త్వం తన వాటా నిధులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతోందన్నారు. వెంటనే కేంద్రం కేరళ బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుకు చెల్లిం చాల్సిన పెన్షన్ నిధులు చెల్లించాలని తపన్‌సేన్ డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు నుండి అమలు చేయాల్సిన పథకాలన్నింటినీ ఒక్కొక్కటిగా తీసేసిందన్నారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును ఆంధ్రప్రదేశ్ టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రంలో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు రక్షణ కోసం కార్మికులు ఉద్యమించాల్సి ఉందని హితవుపలికారు. ఇప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలన్నింటినీ 5 కోడ్‌లుగా మార్పు చేయాలని ప్రయత్నిస్తోం దన్నారు. అందులో భాగంగా బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ యాక్టు, బీడీ వర్కర్స్ వెల్ఫేర్ యాక్టు, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్, ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్ తదితర సంక్షేమ చట్టాలను తీసేసి ఒకే కోడ్‌గా తయారు చేయాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రయత్ని స్తోంది. అన్ని రకాల స్కీముల్లో ఉన్న డబ్బుల న్నింటినీ కేంద్రం కొత్తగా ఏర్పాటు చేయబోయే వెల్ఫేర్‌బోర్డుకు జమ చేసుకోవాలని కొత్త పన్నా గం పన్నిందన్నారు. ఈ వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గా దేశ ప్రధాని వ్యవహరిస్తారని ప్రతిపాదిస్తున్నది. అంటే కార్మికుల డబ్బులన్నింటినీ రాబోయే రోజుల్లో లాభాలే పరమావధిగా పనిచేస్తున్న పెట్టుబడిదారులకు స్టాక్ మార్కెట్ల ద్వారా కట్ట బెట్టాలనే కుట్రను కార్మికులు అర్థం చేసు కోవాలి. చట్టసవరణలకు వ్యతిరేకంగా ఉద్య మించాలని తపన్‌సేన్ పిలుపునిచ్చారు.

మహాసభల్లో రెండో రోజు మొదటి పుట భవన నిర్మాణ రంగంలో మహిళలు ఎదుర్కొం టున్న సమస్యలపై ప్రత్యేకంగా నివేదిక ప్రవేశ పెట్టి చర్చించారు. ఈ నివేదికను వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటి కన్వీనర్ కా॥మాలతీ చిట్టిబాబు ప్రవేశపెట్టారు. నిర్మాణ రంగంలో మహిళలకు పురుషులతో సమానంగా వేతనాలు చెల్లించడం లేదని, పని ప్రదేశంలో వేధింపులకు గురవుతున్నారని, పని కల్పించడంలో వివక్ష ఎదుర్కొంటున్నారని వివ రించారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ యాక్టు ప్రకారం మహిళా కార్మికులకు ప్రత్యేక సదుపా యాలను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్మికులు పనికోసం వేచి ఉండే అడ్డాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా టాయిలెట్ సౌకర్యం కల్పిం చాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. పని ప్రదేశంలో కార్మికుల పిల్లల సంరక్షణ కోసం క్రెచ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా చేయడం లేదన్నారు. చట్ట ప్రకారం రావల్సిన హక్కులు, వివక్షకు వ్యతిరేకంగా పోరాటాల రూపకల్ప నకై అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా మహిళా సబ్ కమిటీలు ఏర్పాటు చేసి కృషిచేయాలన్నారు.

చివరి రోజు 136 మందితో కమిటీని, 44 మందితో ఆఫీసు బేరర్స్‌ను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సుకబీర్‌సింగ్ (హర్యానా), శశికుమార్ (కేరళ) ఎన్నిక య్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కా॥వి.ఉ మామహేశ్వరరావు ఉపాధ్యక్షులుగా, కా॥ఆర్.వి.నర్సింహారావు కార్యదర్శిగా, కమిటీ సభ్యులుగా పిల్లి నర్సిం హారావు, కె.వి.గోపాల రావు (కృష్ణా), బి.వెంకటరావు (విశాఖ), ఎన్.రమణరావు (ప॥గోదావరి) లతో పాటు వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీలో అనసూయ (విశాఖ) ఎన్నికయ్యారు.

టీఎంసీపై కార్మికుల పోరాటం.. వెనక్కు తగ్గిన యాజమాన్యం

- వై.టి.దాస్

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో టోటల్ మెయింటనెన్స్ కాంట్రాక్టు (టీఎంసీ) పద్ధతికి వ్యతిరేకంగా కార్మికులు చేసిన పోరాటం విజయవంతమైంది. గుర్తింపు యూనియన్ సిఐటియుకు సహకారంగా అన్ని యూనియన్లు, కాంట్రాక్టు కార్మిక సంఘాలు ఐక్యంగా నిలిచి పెద్దఎత్తున పోరాడారు. 12 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, మరో 18 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఏకోన్ముఖంగా ఒకే డిమాండ్‌తో దశలవారీగా ఆందోళన జరిపారు. చివరికి అక్టోబర్ 4న లేబర్ కమీషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో టీఎంసీ విధానాన్ని "అబీఎన్స్"లో పెట్టడానికి యాజమాన్యం అంగీకరించింది. దీనితో అన్ని సంఘాలూ ఆందోళనను వాయిదా వేశాయి.

అక్టోబర్ 1 నుండి సింటర్ ప్లాంట్ విభాగంలో టిఎంసి విధానాన్ని అమలు చెయ్యాలని యాజమాన్యం నిర్ణయించింది. దీని కోసం గుజరాత్ వడోదరకు చెందిన "ప్రభ కన్సల్టెన్సీ సర్వీసెస్"కు కాంట్రాక్టు ఇచ్చింది. ఈ విభాగంలో సుమారు 140 కన్వేయర్ల నిర్వహణ కోసం రూ.8 కోట్లతో ఈ కాంట్రాక్టును ఇచ్చారు. ఇప్పటికే వీటికి అవుతున్న వ్యయంతో పోల్చుకుంటే ఇది 3-4 రెట్లు ఎక్కువ. ఇంత ఎక్కువ బడ్జెట్ కేటాయించి బడా కాంట్రాక్టర్లను రప్పించి, ప్లాంట్‌కు ఏ విధంగా ప్రయోజనం కలుగ జేస్తారన్న కార్మికసంఘాల ప్రశ్నకు యాజమాన్యం సమాధానం చెప్పలేక పోయింది. పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ లేదు కాబట్టి ప్లాంట్‌ను 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి కోసం కాంట్రాక్టుకు ఇవ్వడం తప్ప ప్రత్యామ్నాయం లేదని యాజమాన్యం వాదిం చింది. "పర్మినెంట్ ఎంప్లాయీస్‌ను రిక్రూట్ చేస్తే కాంట్రాక్ట్‌కి అయ్యే వ్యయం కంటే తక్కువ ఖర్చుతోనే ఉత్పత్తిని సాధించుతాం అని కార్మిక సంఘాలు సవాల్ చేశాయి. యాజమాన్యం మిన్నకుండి పోయింది.

"మేం టోటల్ మెయింటెన్స్ కాంట్రాక్టు ఇవ్వడం లేదు. కన్వేయర్ల మెయింటెన్స్ మాత్రమే ఇస్తున్నాం"అని మరో మాట చెప్పింది. 'ఎలాగూ కాంట్రాక్టు అవార్డు అయినందున కనీసం 6 నెలలు సమయం మాకు ఇవ్వండి' అని యాజమాన్యం కోరింది. దీన్ని కార్మిక సంఘాలు స్పష్టంగా తిరస్కరించాయి. టోటల్ కాంట్రాక్టు విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే సమస్యే లేదని తేల్చిచెప్పాయి.

కార్మికుల్లో టీఎంసీపై అవగాహన కల్పించడం కోసం, దశల వారీగా జరిగే పోరాటాల్లో పాల్గొనేలా చేశాం. అన్ని డిపార్ట్‌మెంట్ల లోనూ పర్మినెంట్ ఉద్యోగులతో, కాంట్రాక్టు కార్మికులతో విడివిడిగా, ఉమ్మడిగా ధర్నాలు



జరిగాయి. ఆర్ఎంహెచ్‌పీ జంక్షన్ నుండి మెయిన్ గేటు వరకు సెప్టెంబర్ 19న మహాపాదయాత్ర జరిగింది. దానికి ముందు 12వ తేదీన ఇ.డి.(డబ్ల్యూ) ప్రాంగణం దద్దరిల్లి పోయే విధంగా ధర్నా జరిగింది. అక్టోబర్ 1 నుండి సింటర్ ప్లాంట్ 3 నుండి ఆర్ఎం హెచ్‌పీ విభాగాల్లో పూర్తిస్థాయి టూల్‌డౌన్ ఉద్యమం జరిగింది. వీరికి మద్దతుగా ప్లాంట్‌లోని ఇతర అన్ని విభాగాల్లో ప్రతి షిఫ్టు ప్రారంభంలో 2 గంటల పాటు టూల్‌డౌన్ జరిగింది.

చెలరేగుతున్న కార్మికుల ఆందోళన, రాజకీయ పార్టీల మద్దతు

ఇలా ఈ పోరాటం ఇంకా విస్తృతం అవుతున్న నేపథ్యంలో యాజమాన్యం దిగిరాక తప్పలేదు. స్టీల్‌ప్లాంట్‌లో టీఎంసీపై సుమారు 3 నెలల పాటు చేసిన ఆందోళన, పోరాటం కొన్ని అనుభవాలను అందించింది. ప్రభుత్వ, యాజమాన్య వాదనలకు ప్రత్యామ్నాయ వాదనలను, విధానాలను హేతుబద్ధంగా విశదీకరిస్తే కార్మికులు ఆందోళనకు సిద్ధమౌతారని మరోసారి రుజువైంది. ప్రభుత్వ రంగం పట్ల, ఉద్యోగులపట్ల మోడీ ప్రభుత్వం దూకుడుగా ఉన్న నేపథ్యంలో ఈ దూకుడును కార్మికవర్గం ఆపగలదనే భరోసా విశాఖ ఉక్కు కార్మికులు, ఉద్యోగులు ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులకు అందించారు. మరీ ముఖ్యంగా టీఎంసీ విధానం పర్మినెంట్ ఉద్యోగులకు ప్రత్యక్షంగా ఏ విధంగా నష్టమని ప్రశ్నించిన యాజమాన్యానికి గట్టి సమాధానం ఇచ్చారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ భద్రత, నిర్వాసితులకు ఉద్యోగాలు, పర్మినెంట్ ఉద్యోగుల జీతభత్యా లపైన ప్లాంట్ భవితవ్యంపైన ఈ విధానం దుష్ప్రభావం చూపుతుందని విశ్వసించారు కాబట్టే ఈ పోరాటం విజయవంతమైంది.

ఉన్నత స్థాయిలోని కొంత మంది అధికారులు, కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు మాత్రమే ఈ టీఎంసీ ప్రయోజనం కలిగిస్తుందని, మొత్తం ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియను బడా కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలకు వదిలి వేస్తున్నారని కింది స్థాయి అధికారులు బాధపడ్డారు. టీఎంసీ పై పోరాటం విజయం సాధించడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

టీఎంసీపై విజయం సాధించిన సందర్భంగా అక్టోబర్ 4న కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద అఖిలపక్ష కార్మికసంఘాల ఆధ్వర్యంలో సభ జరిగింది. టీఎంసీ విధానంతో పాటు ప్లాంట్ ప్రైవేటీకరణ, ఇతర అంశాలపై సమష్టిగా, మరింత దృఢంగా పోరాడతామని నాయకులంతా తెలిపారు. ప్లాంట్ పురోభివృద్ధి కోసం అన్ని కార్మికసంఘాలు గట్టిగా నిలబడిన ఉదంతాలు గతంలో ఎన్నో ఉన్నాయి. టీఎంసీపై పోరాటం అందులో మరొకటైంది.

కౌలురైతుల సమస్యలను వెలుగులోకి తెచ్చిన కౌలు రైతుల పాదయాత్ర

మన రాష్ట్రంలో వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తూ మూడు వంతుల పంటలను పండిస్తున్నది కౌలు రైతులే. రాష్ట్రప్రభుత్వం ఏటా వ్యవసాయ బడ్జెట్‌లో కేటాయించిన పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, పరిహారాలు, ఇతర రాయితీలు వీరికి అందటం లేదు. భూములు కౌలుకు ఇచ్చి పంటలు వేయకుండా వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకొంటున్న భూయజమానులకు ఇస్తున్నారు. దీంతో కౌలు రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేయడంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగి నష్టపోతు న్నారు. కౌలు రైతులకే అన్ని హక్కులు కల్పించాలని 20 సంవత్సరాలు భూ ఆధీకృత సాగుదార్ల చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం భూయజమాని ప్రమేయం లేకుండా ప్రభుత్వమే గ్రామసభ ద్వారా కౌలుదారుని గుర్తించి రుణ అర్హత కార్డు ఇచ్చి పంట రుణాలు ఇన్‌పుట్ సబ్సిడీలు, ఇతర హక్కులు కల్పించాలి. కానీ ప్రభుత్వం వీటిని అమలు చేయకుండా భూయజమానుల కొమ్ము కాస్తోంది.

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం కౌలు రైతులను సంఘటితం చేసి చట్ట ప్రకారం అన్ని హక్కులు పొందేలా చేయ టానికి అక్టోబరు 10వ తేదీ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నుండి పాదయాత్ర మొదలై తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 500 కిలోమీటర్లు, 200 గ్రామాల్లో 22 రోజులపాటు పాదయాత్ర జరిగింది. అక్టోబరు 31వ తేదీన గుంటూరు లోని రాష్ట్ర వ్యవసాయ కమీషనర్ కార్యాలయానికి చేరింది. అక్కడ సభ జరిగింది.

2004 ప్రొఫెసర్ జయతీఘోష్ కమీషన్ రాష్ట్రంలో కౌలురైతులే ఎక్కువ పంటలు పండిస్తున్నారని వారిని గుర్తించి అన్ని హక్కులు కల్పించాలని సిఫార్సు చేసింది. 2016 రాష్ట్ర ప్రభుత్వం నియ మించిన ప్రొ॥రాధాకృష్ణ కమీషన్ రాష్ట్రంలో 44 లక్షల మంది సాగుదార్లు ఉంటే అందులో 32 లక్షల మంది కౌలుదార్లు ఉన్నారని, అందులో 7.5 లక్షల మంది సొంత భూమి లేని వారని మిగతా వారు కూడా ఒకటి లేక రెండు ఎకరాల్లోపు వారే కౌలుదార్లుగా ఉన్నారని తేల్చింది. కౌలురైతుల్లో దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏటా 1.6 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించి రూ.75 వేల కోట్లు పంట రుణాలు, రూ.26 వేల కోట్లు ఇన్‌పుట్స్ సబ్సిడీలకు కేటాయిస్తోంది. అయితే ఇది వాస్తవసాగుదార్లు కౌలురైతులకందడం లేదు.

2014లో చంద్రబాబు తాను అధికారానికి వచ్చిన వెంటనే 2011 చట్టాన్ని అమలు జరిపి కౌలురైతులకు అన్ని హక్కులు కల్పిస్తామని వాగ్దానం చేశారు. అప్పటికే కొద్ది పాటిగా ఉన్న కౌలురైతుల రుణాలు రద్దు చేస్తామని చెప్పారు.

కానీ ఈ నాలుగేళ్ల కాలంలో చట్టాన్ని ఏమాత్రం అమలు చేయలేదు. పంటలు వేయని భూయజమానులకే అన్నీ కట్టబెడు తున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు కోల్పోతే పరిహారాలు పంటలు వేయని భూయజమనాలకే ఇస్తున్నారు. కౌలురైతుల రుణాలు కూడా మాఫీ చేయలేదు. మొత్తం కౌలు రైతులకు రూ.574 కోట్లు రుణాలు ఉండగా రూ.144 కోట్లు మాత్రమే రద్దు చేశారు.

కౌలు రైతుల సంఘం పోరాడిన చోట కౌలురైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు వస్తున్నాయి. మొత్తం రూ.75 వేల కోట్లు పంటరుణాల్లో కౌలు రైతులకు దక్కుతుంది రూ.2 వేల కోట్లల్లోపు మాత్రమే. ఈ పరిస్థితుల్లో కౌలు రైతులు అధిక వడ్డీల భారంతో, మార్కెట్‌లో ధరలు లేక నష్టాలు పాలయ్యారు. రోజూ ఒకరో ఇద్దరో ఆత్మహత్య చేసుకొం టున్నారు.

ఈ విషయాలన్నీ ప్రజల దృష్టికి తేవటానికి కౌలు రైతులను సంఘటితం చేసి హక్కులు సాధించుకోటానికి పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర జరిగిన ప్రాంతాల్లో కౌలురైతులకు కార్డులు, రుణాలు రాలేదు. ఒకటి లేదా 2 శాతం మందికి మాత్రమే రుణాలు వచ్చాయి. వరిపంట కూడా సక్రమంగా లేదు. దోమపోటు, ఎలుకల బెడద ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంది. తాళ్లరేవు, కాజులూరు ప్రాంతంలో షుమారు 60 వేల ఎకరాలకు నీరు సక్రమంగా అందటం లేదు. కోనసీమలో మాగాణి భూములు చెడగొట్టి రొయ్యల చెరువులు వేస్తున్నారు. దీంతో కౌలురైతులకు, కూలీలకు ఉపాధి లేకుండా పోయింది. అంతేగాక కాలుష్యం పెరిగి తాగు నీటికి ఇబ్బందిగా ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో కూడా అట్లాంటి పరిస్థితే ఉంది. 2011 చట్టాన్ని అమలు చేయకుండా రెవెన్యూ అధి కారులే అడ్డంకులు పెడుతున్నారని కౌలు రైతులు వాపోతున్నారు. చట్టంలో లేని అంశాలు భూయజమాని అంగీకారం కావాలని, పాస్‌పుస్తకం జిరాక్స్ కావాలని కోరుతున్నారు. బ్యాంకు అధికారులు కూడా రుణాలు తమకు ఇవ్వకుండా పంటలు వేయని భూయజమానులకు ఇస్తున్నట్లు కౌలు రైతులు చెప్పారు. భూయజమానులు కూడా కౌలు రైతులు గుర్తింపుకార్డుల కోసం అర్జీలు పెట్టుకుంటే భూములు కౌలుకు ఇవ్వం అని బెదిరిస్తున్నట్లు కూడా కౌలుదార్లు చెప్పారు. కృష్ణాజిల్లాలో చాలా తక్కువ మందికి కౌలు కార్డులు, రుణాలు వచ్చాయి. కొన్ని గ్రామాల్లో భూయజమానులు భూములు వేరేవారికి కౌలుకు ఇచ్చి తన బినామీలకు కార్డులు, రుణాలు ఇప్పించారు.

అన్నిచోట్లా పేదలు, కౌలురైతులు పాదయాత్రకు స్వాగతం పలకటమేగాక ఎంతో ఉత్సాహంతో పాల్గొంటున్నారు. సంఘం అండతో రబీ సీజన్‌లోనైనా గుర్తింపుకార్డులు, రుణాల కోసం పోరాటానికి ముందుకొస్తామని చెప్పారు. ఈ పాదయాత్ర ద్వారా కౌలు రైతుల సమస్య గ్రామాల్లో బాగా చర్చకు వచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికీ 62 శాతం మందికి ఉపాధి, అందరికీ ఆహార భద్రత కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలంటే ముందు కౌలురైతులను కాపాడాలని అందరూ గుర్తిస్తున్నారు.

నాగబోయిన రంగారావు, అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం

మృగాల మధ్య...

'ప్లీజ్.. డోర్ క్లోజ్ చెయ్యొద్దు... నాకస్సలు ఇష్టం లేదు'

'ఇక్కడ నీ ఇష్టం కాదు... కెరీర్ ముఖ్యం. ఆలోచించుకో'

శృతి ముఖం ఎర్రబడింది. మొదటి రోజు నుండే తన శరీరాన్ని తాకాలని చేసిన వెకిలి చేష్టలు ఎలాగో భరించింది. తర్వాత బలవంతంగా ముద్దు పెట్టుకోవాలని ప్రయత్నిస్తే ఎలాగో తప్పించుకుంది. తన మౌనాన్ని అంగీకారం అనుకుని రోజూ ఏదో విధంగా బాధపెడ్తున్నా, ఉద్యోగం పోతుం దేమోనన్న భయంతో ఇన్నాళ్లూ భరించింది. కానీ ఈ రోజు తలుపు మూసేవరకు వ్యవహారం రావడంతో ఆమె కోపం కట్టలు తెంచుకుంది.

'షటప్ మిస్టర్ సూర్యా.. కేరెక్టరే ముఖ్యం నాకు. ప్రతిభ ఉంటే ఎక్కడైనా బతకొచ్చు'

ఎక్కడికి వెళ్లినా ఆడది ముందు ఆడది. తర్వాతే ఉద్యోగి. వెకిలిగా నవ్వుతూ అన్నాడు.

'నీలాంటి మృగాలే అన్నిచోట్లా ఉండరు. ఇది కాకపోతే ఇంకో ఉద్యోగం'.

ఈ రోజుల్లో ఇది కామన్. బాస్‌ను తృప్తిపరిస్తే జాబ్ సెక్యూరిటీ, ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు లేకపోతే ఉన్న జాబే ఊడిపో వచ్చు. ప్రతిచోటా ఇంతేనని నువ్వే తెలుసు కుంటావులే'

'అదీ చూద్దాం' అంటూ సూర్యని గట్టిగా పక్కకు తోసి బయటకు నడిచింది శృతి.

ఆటో ఎక్కింది శృతి. ఆమెకు అమ్మా నాన్న గుర్తొచ్చారు. ఆ రోజు ఇంకా ఆమెకు గుర్తే.

'నాన్నా.. నేను హైదరాబాద్‌కు వెళ్లి ఏదైనా ఉద్యోగం చూసుకుంటా'

'ఇక్కడ ఏడవలేక పోయావ్.. ఇంక అక్కడ ఏం ఏడుస్తావ్?'

'అక్కడ అవకాశాలు ఎక్కువ నాన్నా.. వెళ్తాను'

'వెళ్లి ఎక్కడ ఉంటావ్? ఆడపిల్లవి.. ఒక్కదానివి ఏమైనా జరిగితే మేం ఊళ్లో తలెత్తుకోగలమా? ఓ మంచి సంబంధం వచ్చింది. నోర్మూసుకుని పెళ్లి చేసుకో'

'ఏమేవ్ ఇది హైదరాబాద్ వెళ్తుందట!'

'శృతీ.. నాన్న చెప్పేది నీ మంచికేగా.. ఎందుకు తల్లీ నీకు లేనిపోని ఇబ్బందులు?' అంది అమ్మ.



'లేదమ్మా.. నేను వెళ్లి తీరుతాను' శృతి పంతంగా అంది.

శృతిది ఓ పల్లెటూరు. ఇంజినీరింగ్ చదివాక క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం రాలేదు. ఓ ఉద్యోగం చేస్తూ తన కాళ్ల మీద తను నిలబడాలని ఆమె కోరిక.

అలా హైదరాబాద్ వచ్చిన నాలుగు నెలలకి ఎలాగో కష్టపడి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదిం చింది. ఏం లాభం? అక్కడ చేరిందో లేదో మేనేజర్ నుండి లైంగిక వేధింపులు మొదలయ్యాయి. బూతు మెసేజ్‌లు, వీడియోలు మామూలే. ఈ రోజు వ్యవహారం మరీ శృతిమించడంతో ఉద్యోగాన్ని వదిలేసింది శృతి.

ఎందుకో ఆమెకు ఇంటికి వెళ్లిపోదామనిపించింది. పెళ్లి చేస్తారు. మళ్లీ ఇంకొకరిపై ఆధారపడటం జీవితాంతం ఎదుర్కోవాల్సిన సమస్య.

తన ఆలోచనలు సాగుతూండగానే హాస్టల్ వచ్చేసింది.

'ఏమైంది శృతి? అలా ఉన్నావ్' పలకరించింది రూమ్మేట్ రవళి.

'మా బాస్ గురించి నీకు తెల్సిందేగా! వాట్టి రోగ్. ఈ రోజు మరీ హద్దులు దాటాడు'

'ఏం చేశాడేంటీ?'

'ఏకంగా డోర్ క్లోజ్ చేశాడు'

'చేయి పట్టుకోవడం, ముద్దు పెట్టుకోవాలని ప్రయత్నించడం, డోర్ క్లోజ్ చెయ్యడం.. ఇవన్నీ కామనా?' అడిగింది శృతి.

'మరి కామన్ కాక ఇంకేంటి? అలా అని ఉద్యోగం వదిలేస్తావా? ఎక్కడికెళ్లినా ఇదే బాగోతం. తెలివి తక్కువగా ఉండి ఇంత మంచి జీతం తెచ్చే ఉద్యోగం వదులుకోకు' అంది హరిత.

'అదెప్పుడూ అంతేలేవే. వదిలేయ్ దాని మాటలు' అంది రవళి.

రోజులు గడిచాయి. శృతి మళ్లీ కష్టపడి ఇంకో ఉద్యోగం వెతుక్కుంది. జాయిన్ అయిన పదిహేను రోజుల తర్వాత అక్కడ కూడా అదే కథ. మనసు చంపుకుని రాజీపడలేక మానేసింది.

'ఎక్కడ మొదలైనా ఇక్కడికే వస్తుంది. లోకం ఇంతే' అనుకుంది ఆమె. ఎన్ని ప్రయత్నాలు చేసినా మంచి ఉద్యోగం దొరకలేదు. చేతిలో డబ్బులు అయిపో వచ్చాయి.

'ఇక ఇంటికి తిరిగి వెళ్లిపోవడమే మార్గం. పూర్తిగా ఓడిపో యాను. ఇంట్లో వాళ్ల ఇష్టానికి తలవంచి పెళ్లి చేసుకోవడం తప్ప ఇంకేం చేయలేనేమో' అని అనిపించింది శృతికి.

ఇంటికి వెళ్లే ముందు అమ్మకు ఒకసారి ఫోన్ చేద్దాం, ఏమంటుందో?

'ఇక్కడేం బాగాలేదమ్మా. ఇంటి కొచ్చేస్తా' అంది శృతి.

'బాగాలేకపోవడం ఏంటిరా తల్లీ. చక్కగా ఉద్యోగం చేస్తున్నావు. నీ కాళ్ల మీద నువ్వు నిలబడ్డావు. ఇప్పుడు ఏమైందిరా?'

'లేదమ్మా. ఇక్కడ మగాళ్లందరూ మృగాలేనమ్మా. ఇక నా వల్ల కాదమ్మా. ఇక్కడ ఉండలేను. ఇంటికి వచ్చేస్తానమ్మా'

తల్లి ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా అంది. 'ఇంటికి వచ్చి ఏం చేస్తావు. ఇక్కడికి వస్తే పెళ్లి చేస్తాం. వచ్చేవాడు కూడా మృగం అయితే ఏం చేస్తావు? ఉద్యోగం లేక జీవితాంతం వాడి కాళ్ల దగ్గర పడి ఇలాగే ఏడుస్తావా?'

శృతికి అది పెద్ద షాక్. 'అమ్మా...'

'పద్దెనిమిదేళ్లకి నాకు పెళ్లి చేశారు. నాకు జాబ్ చెయ్యాలని ఉండేది. కానీ బలవంతంగా పెళ్లి చేశారు. తర్వాత నాన్న మాటే నాది తప్ప ఏ విషయంలోనూ నాకు స్వేచ్ఛ లేదు. నా మాటకు విలువ లేదు. రేపు నీ గతి నాలానే కావాలా? ఇంత చదువుకుని సమస్యలకు భయపడి వెనక్కి వచ్చేస్తాన నడమేమిటే'

ఆ రోజు నాన్న వద్దన్నా నువ్వు హైద్రాబాద్ వెళ్లినప్పుడు నేను సంతోషపడ్డా. ఆడదాని జీవితమంతా మృగాల మధ్య సాగే ఆట. నువ్వు నాకన్నా బాగా చదువుకున్న దానివి. ఇంతకు మించి చెప్పేదేమీ లేదు. నీ ఇష్టం' అని ఫోన్ పెట్టేసింది సునంద.

ఇంటికి వెళ్లే ఆలోచనను విరమించు కుంది శృతి.

కింద హాస్టల్ దోబీ – సావిత్రి. హాస్టల్ ఓనర్‌తో గొడవపడుతోంది.

'ఏంట్రా రెచ్చిపోతున్నావ్? నీకెంత ధైర్యం ఉంటే నా మీద చెయ్యి వేస్తావ్? నీకు సదువులు సదివే కూతుళ్లు లేరూ.. నచ్చినోడా.. ఇంకోసారి నా జోలికి వచ్చావంటే చమ్డాలు వలిచేస్తా...' ఆమె చెయ్యి అతని కాలర్ మీద ఉంది. అప్పటికే రెండు చెంపలు వాయించినట్టుంది.

వరహాల్రావు బిక్కచచ్చిపోయి అటూ ఇటూ చూస్తున్నాడు అతను.

'నువ్వేంట్రా నన్ను పనిలోకి రావద్దనేది? నీ దగ్గర పని కాకపోతే పది కొలువులు నాకు. నాకు రావాల్సిన సొమ్ములు తియ్యి'

అతని మొహం మీద ఉమ్మేసి.. అక్కడి నుండి వెళ్లిపోయింది సావిత్రి.

అందరూ రూముల్లోకి వచ్చారు.

'సావిత్రిలా ఉండాలే.. ఆ ఓనర్‌గాడు ఎన్ని వెకిలి వేషాలు వేసినా చూసీ చూడనట్టు పోతుంటామే. అలాంటిది సావిత్రి అంత ధైర్యంగా వాణ్ణి ఉతికేసింది' అంది పక్కరూమ్ అర్చన.

సావిత్రే శృతి కళ్ల ముందు మెదిలింది.

'సావిత్రికి ఉన్న ధైర్యం కూడా నాకు లేదే. ఇంకో పని దొరకదేమో అన్న బెంగ లేదు సావిత్రికి. ఏం చదువుకోపోయినా ఆమెకు తన మీద తనకు ఎంత నమ్మకం. బతుకు మీద ఎంత భరోసా?

మరి అమ్మ ఎంతో కొంత చదు వుకుంది. తను, తన హాస్టల్‌మేట్స్ బాగానే చదువుకున్నారు. కానీ నలుగురికి తెలిస్తే ఏమౌతుందో, ఎవరేం అనుకుంటారో, పరువుగా బతకలేమేమోనన్న భయాలు, అభద్రతా భావాలు తమలాంటి చదువుకున్న వారికి ఎక్కువనుకుంటా! సమస్య నుంచి ఇంకో సమస్య వైపు పరిగెత్తడమే పరిష్కారం అని అనుకుంటారు తమలాంటి వాళ్లు.

నిర్ణయం తీసుకున్నాక హాయిగా నిద్రపట్టింది శృతికి.

శృతి మనసులో ఓ ఆలోచన రూపు దిద్దుకుంది.

'అమ్మగారూ! మీరు బాగా చదువు కున్నోరు. నాకు ఎక్కడైనా పని ఇప్పించరు' అన్న పక్కింటి యాదమ్మ గుర్తుకొచ్చింది.

తన అకౌంట్‌లో ఉన్న అమౌంట్ చెక్ చేసింది. నలభై వేలుంది.

'హమ్మయ్య' అని అనుకుంది శృతి.

వెంటనే రెడీ అయ్యి బయల్దే యాదమ్మని కల్సింది.

'యాదమ్మా... ఎలా ఉన్నావ్?' పలకరించింది.

'బానే ఉన్నానమ్మ. వాడు తెచ్చిం దంతా తాగుతూనే ఉంటాడమ్మా.. మిగిలేదేం ఉండదు.. చూస్తే పిల్లలు పెద్దవాళ్ల వుతున్నారు... ఏం చేయాలో తెలియడం లేదు' అంది నిరుత్సాహంగా.

'యాదమ్మా.. నీకు నెల జీతం నేని స్తాను. నువ్వు రోజూ బజ్జీలు చేయగలవా?'

'చేస్తానమ్మా... ఏమైనా చేయగలను' అంది యాదమ్మ.

'సరే.. ఎప్పుడు చేయాలో నేను చెబుతాను' అని బయటికి వచ్చేసింది శృతి.

ఆన్‌లైన్ బిజినెస్ పోర్టల్, మార్కెటింగ్, ఏజెన్సీ దగ్గరికి వెళ్లింది శృతి. వాళ్లతో మాట్లాడి 'బజ్జీ బజార్' పేరుతో ఓ సైట్ క్రియేట్ చేసింది.

తర్వాత యాదమ్మతో బజ్జీలు చేయించింది. తనకు పరిచయస్తులైన వారందరికీ వారి అడ్రస్‌లకు మిర్చిబజ్జీలు పంపింది వేడివేడిగా. బజ్జీలు ఇంటికే రావడంతో అందరి నుండి మంచి స్పందనే వచ్చింది. తర్వాత తనకు తెల్సిన హాస్టల్స్‌లోని ఫ్రెండ్స్ అందరికీ కూడా పంపింది.

అది డబ్బులకు కాకపోయినా, ఆ రుచి వారికి చేరితే... వాళ్లే తమ మాటలతో పబ్లిసిటీ చేస్తారని శృతికి తెలుసు.

రెండు నెలలు తిరిగేలోపే ఆర్డర్లు పెరిగిపోయాయి. ఇంకా నలుగురు మహిళలను నియమించింది వంటకి.

సంవత్సరం తిరిగేసరికి దానికే ఓ బిజినెస్ సైట్ తీసుకోవాల్సి వచ్చింది. నలుగురు కాస్తా ఇరవై మంది అయ్యారు పనివాళ్లు. జిల్లా నుండి రాష్ట్రానికి పెరిగింది వ్యాపారం. సావిత్రికి మనసులోనే థాంక్స్ చెప్పుకుంది శృతి.

– శృంగవరపు రచన



సినిమా సమీక్ష

అరవింద సమేత

అరవింద సమేత సినిమాలో హీరో పేరు వీరరాఘవరెడ్డి, ఊరు కొమ్మద్ది. ఈ ఊరు కడప జిల్లా వీరపునాయునిపల్లి మండలంలో ఉంది. తెరపైన ఎన్టీఆర్ ను చూసినపుడు నేను 26 ఏళ్ల క్రితం కొమ్మద్దిలొ కలుసుకున్న గంగిరెడ్డి గుర్తుకొచ్చాడు. ఆయన ఇంట్లో ఆరుగురు హత్యకు గురయ్యారు. "పోయిన వాళ్లంతా పోయారు. ఉన్న వాళ్లు జైల్లో ఉన్నారు. ఇకచాలు శాంతి కావాలి" అన్నాడు ఆయన. ప్రత్యర్థుల ఇంట్లో కూడా ఆరుగురు లేరు. గంగిరెడ్డి ఇప్పటికీ అదే ఊళ్లో ఉన్నాడు. ఆయన పిల్లలు కడపలో స్థిరపడ్డారు. ప్రత్యర్థులు కూడా అదే గ్రామంలో ఉన్నారు.

గాయం మానిపోయి మచ్చగా మిగిలింది. వాళ్ల పిల్లలకి ఇది ఒక కథగానే తెలుసు. ఇప్పుడు గాయాల్ని మళ్లీ గుర్తు చేస్తున్నారని తండ్రిని పోగొట్టుకున్న ఓ వ్యక్తి నాతో ఫోన్‌లో వాపోయాడు. సీమలో ఫ్యాక్షన్ మాయమై చాలా కాలమైంది.

ఆదాయ వనరులు లేని కాలంలో చిన్న చిన్న విషయాలకు ఘర్షణ పడేవాళ్లు. ఆ ఘర్షణ హింసాత్మకంగా ఉండేది. రవాణా సాధనాలు పెరిగేసరికి రాయలసీమ నుంచి వెళ్లిన వాళ్లు ప్రపంచమంతా విస్తరించారు. ఒడిశా, గుజరాత్, పంజాబ్‌ల్లో కూడా కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. చివరికి కశ్మీర్‌లోని లోయలో కూడా వర్క్ చేశారు. ఆఫ్రికా దేశాల్లో లిక్కర్ వ్యాపారులు వీళ్లే. మడగాస్కర్‌లో బంగారు గనుల లీజుదారులు వీళ్లే.

డబ్బు ఉంటే అధికారాన్ని కొనొచ్చు. పార్టీ ఏదైనా పనులు జరుగుతాయి. డబ్బు కోసం లోకల్ ఫ్యాక్షన్ ఇప్పుడు అవసరం లేదు. ఎన్నికల నిర్వహణలో మార్పులు వచ్చేసరికి రిగ్గింగ్ కష్టమై ముఠాలు, బాంబుదాడులు తగ్గిపోయాయి.

పోలీసుల అవినీతి, కఠినత్వం కూడా ఫ్యాక్షన్ అంతర్థానానికి ఒక కారణం. ఫ్యాక్షన్‌ను మోయడం కంటే పోలీసుల్ని, లాయర్లను మేపడమే కష్టమైంది. 20 ఏళ్లుగా యువకుల్లో ఎలాంటి భావజాలం మొలకెత్తకుండా బొన్సాయ్ మొక్కలుగా తయారు చేసిన ఘనత నారాయణ, చైతన్యలదే.

కెరీరిజం వైపు యూత్ వెళ్లేసరికి కమ్యూనిస్టులకు కార్యకర్తలు కరువయ్యారు. ఫ్యాక్షనిస్టులకు తుపాకులు, కొడవళ్లు మోసేవాళ్లులేకుండా పోయారు. పల్లెల్లోకి స్కూల్ బస్సుల్లు రావడం మొదలయ్యే సరికి చదువు అనే కాన్సెప్ట్ మొదలైంది. ఉన్నవాళ్లు చదువుల కోసం వెళితే, లేనివాళ్లు పనుల కోసం పొట్ట చేతపట్టుకుని వలస వెళ్లిపోయారు.

హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసైనా నాలుగు డబ్బులొస్తాయని అర్థమయ్యేసరికి, పల్లెల్లో ఉండి కొట్టుకు చావడం అనవసరమని యువకులు భావించారు. సమాజంలో రిలేషన్స్ దెబ్బతినడం, వాల్యూస్ మిస్ కావడం కూడా ఫ్యాక్షనిజాన్ని మాయం చేసింది. ఇపుడు ఎవడికి వాడు బాగా బతికితే చాలనుకుంటారు. ఎవడి కోసమో చచ్చిపోవాలి అనుకోరు.

గన్మెన్లను నమ్ముకుని ఫ్యాక్షన్ నడిపే పరిస్థితుల్లో నాయకులు లేరు. దాడి జరిగినప్పుడు గన్మెన్లే మొదట పారిపోతున్నారు.

ఈ తలనొప్పులన్నీ ఎందుకని ప్రత్యర్థితో ఒప్పందాలు చేసేసుకుంటున్నారు. క్విడ్‌ప్రోకో పద్ధతిలో వర్క్స్ పంచుకుంటున్నారు. నాయకుల పిల్లలంతా హాయిగా విదేశాల్లో చదువుకుని, డబ్బుతో ఎన్నికలను కొంటూ ఉంటే ఇంకా మన సినిమా వాళ్లు కృష్ణవంశీ 'అంతఃపురం' నాటి భావజాలంతో సినిమాలు తీస్తూ 'శాంతి కావాలి' అంటున్నారు.

ఈ సినిమాలో బసిరెడ్డి (జగపతిబాబు) తన కొడుకునే చంపేస్తాడు. 30 ఏళ్లుగా నాకు ఫ్యాక్షన్ గురించి తెల్సు. కొడుకుని చంపిన బసిరెడ్డి గురించి వినలేదు. ఎందుకు సామీ సీమ వాళ్లని అంత క్రూరంగా చూపిస్తారు? ఈ సినిమాలో కొన్ని సీన్స్ చాలా బావున్నాయి. కథతో ఎన్ని విభేదాలున్నా ఎన్టీఆర్ నటన, త్రివిక్రమ్ డైలాగులు బావున్నాయి. ఫొటోగ్రఫీ సూపర్. రెండు పాటలు, హీరోయిన్ నటన ఓకే. టైటిల్ కోసం ఆమె సీన్స్ సాగదీసినట్టుంది.

ఫ్యాక్షన్‌లో మహిళలు రెండు రకాలుగా ఉంటారు. భర్తకు తోడుగా ఫ్యాక్షన్ నడిపే వాళ్లు, భర్త ఫ్యాక్షన్‌ను భరిస్తూ భయంతో బతికేవాళ్లు. నిజానికి సమాజంలో మామూలు మగవాళ్లు కూడా భార్యల దగ్గర ఫ్యాక్షనిస్ట్‌లే ఒకప్పుడు. కాలం మారింది. పల్లెల్లో ఆడవాళ్లు కూడా పిల్లల కోసం తిరగబడుతున్నారు. సినిమాలు ఎప్పుడూ అగ్రవర్ణాలనే గ్లోరిఫై చేస్తుంటాయి. సీమలో ప్రధానంగా రెడ్లు, కొంత కమ్మవాళ్లు ఫ్యాక్షనిస్టులు. కర్నూలు జిల్లాలో బోయ ఫ్యాక్షనిస్టులున్నారు. ఫ్యాక్షన్‌లో అగ్ర వర్ణాలకంటే బీసీలే ఎక్కువ నష్టపోతాయి. చనిపోయిన రాజు గురించే మాట్లాడతారు తప్ప ఆ రాజుని కోసం 'ఒరిగిన నర కంఠాల' గురించి ఎవరు మాట్లాడతారు? సినిమాలో బసిరెడ్డి చనిపోతే, భార్య ఎమ్మెల్యే అవుతుంది. కాకపోయినా ఆమెకు నష్టం లేదు. ఆస్తిపాస్తులుంటాయి. కానీ చనిపోయిన అనేక మంది పేదవాళ్లు భూమిలేని వాళ్లు. వాళ్లు చనిపోతే బతుకు కోసం యుద్ధమే చేయాలి. పిల్లల్ని సాకడానికి కూలి బతుకులు బతకాలి. బీసీ, దళిత కులాల మహిళల కన్నీళ్లు చరిత్రలోకి ఎక్కవు.

సినిమా ఒక ప్రభావితం చేసే సాధనం. అందుకే ఇంత వ్యాసం. మా తాత ముత్తాతల కాలం నుంచి మాకు నీళ్లు లేవు. మావి మెట్ట భూములు. వానొస్తే పండుతుంది. లేదంటే ఎండుతుంది. నానా సావు సచ్చి పండించిన పంట తీరా ఇంటికొచ్చాలకు ధరలుండవు. రాజకీయ నాయకుల 'పుణ్యమా' అని ఇక్కడ పరిశ్రమలు కూడా లేవు. ఉద్యోగాల కోసం, పనుల కోసం మేము మా పిల్లలు వూళ్లు ఇడిసి దేశాలు తిరుగుతున్నాం. గాయాలు మానిపోయాయి. మమ్మల్ని గెలక్కండి సార్.

అసలు మా పిల్లలకి తుపాకులు, వేట కొడవళ్లు మోసే శక్తి లేదు. అసలే మందులు మాకులు వేసి పంటలు పండిస్తాంటే అవి తిని, వాడికి బందూకు మోసే సత్తువ యాడుంది? ఇపుడు బాంబులు చుట్టేవాడు లేడు, విసిరేవాడూ లేడు.

– జీఆర్ మహర్షి

Printed, Published & Edited by M.A.Gafoor on behalf of CITU A.P. State Committee from N.P.R. Bhavan, 24-24-14, Rajaka veedhi, Durgapuram, Vijayawada -3, Type setting & Printing at Prajasakti Daily Printing Press, Nulakapeta, Tadepalli, Guntur Dt.

ఏలూరు : అంగన్‌వాడీ సమస్యలపై ధర్నా

విశాఖ : ఆశా వర్కర్ల ధర్నా

చిత్తూరు : ఆశా వర్కర్ల ధర్నా

విజయనగరం : ఆశా వర్కర్ల ధర్నా

వేతనాల కోసం గ్రానైట్ కార్మికుల ధర్నా

మిడ్డేమీల్ ధర్నా

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఛలో తిరుపతి

అరబిందో కార్మికుల న్యాయదీక్ష

Karmikalokam 2018 |November, Pages 36, Publishing 2.11.18 Post: Dt. 4, 5.11.18, RNI No. APTEL / 1985 / 1324, D/VJ/169/2018-2020

KLVO1A536

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య - కార్యాచరణ దినోత్సవం

కనీస వేతనాల ముసాయిదా జీఓ రద్దు చేయాలి

ఎలక్ట్రిసిటీ రాష్ట్ర సదస్సు

నిర్మాణ కార్మికుల అఖిల భారత మహాసభలు

తిరుపతి : డిసిఎల్ ముట్టడి

ఏలూరు : డిసిఎల్ ముట్టడి

కాకినాడ: డిసిఎల్ ముట్టడి

శ్రీకాకుళం : డిసిఎల్ ముట్టడి

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLV01A536
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	28/8/23
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	No
తయారు చేసినది	Nandini
పేజీలు విడదీసినది	Nandini
స్కాన్ చేసినది	Nandhu
పరీక్ష చేసినది	Pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యబడి	
తప్పులు	No
పరిస్థితి	good